ప్రజాశక్తి

బుధవారం డిసెంబర్ 31 2025 పేజీలు 12



విజయనగరం

పార్వతీపురం మన్యం

విజయనగరం ఆటో ప్రచారం చేస్తున్న నాయకులు

సిఐటియు మహాసభల జయప్రదానికి

విస్తృత ప్రచారం

విశాఖపట్నంలో బుధవారం జరిగే సిఐటియు జాతీయ మహాసభల జయప్రదానికి ఆ యూనియన్ నాయకులు విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో మంగళవారం విస్తృత ప్రచారం చేపట్టారు. ఆటో, బైక్ ర్యాలీలు నిర్వహిస్తూ, ఊరు వాడ ప్రచారం చేస్తూ కార్మికులను సన్నద్ధం చేస్తున్నారు. జనవరి 4న జరిగే సిఐటియు బహిరంగ సభకు మేము సైతం.. అంటూ అన్ని రంగాల కార్మికులు, స్కీమ్‌వర్కర్లు తరలివెళ్లేందుకు సమాయత్తం అవుతున్నారు.

ప్రజాశక్తి-దత్తిరాజేరు

విశాఖలో జరుగు సిఐటియు 18వ అఖిలభారత మహాసభలు జయప్రదం చేయాలని కోరుతూ ఆటో కార్మికులు విజయనగరం జిల్లా దత్తిరాజేరు మండలం మానాపురం నుండి కోమటిపల్లి జంక్షన్ వరకు ఆటో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వి.లక్ష్మి మాట్లాడుతూ ఈనెల 31 నుండి జనవరి 4 వరకు విశాఖలో మహాసభలో దేశవ్యాప్తంగా ప్రభుత్వాలు అనుసరించిన విధానాలపై చర్చిస్తారని తెలిపారు. కార్మిక వర్గంపై జరిగిన దాడిపైన, కార్మిక కోడ్‌ల రద్దుకై, అసంఘటిత రంగ కార్మికుల పరిస్థితులపై, రవాణా రంగంపై కేంద్ర ప్రభుత్వం చేసిన ఆంక్షలు తదితర అంశాలపై సుదీర్ఘంగా చర్చించి పోరాట కార్యక్రమాన్ని రూపొందిస్తారని తెలిపారు. ఈసందర్భంగా జనవరి 4న జరుగు బహిరంగ సభను జయప్రదం చేయాలని కోరారు.కార్యక్రమంలో చేర గౌరీశ్వరరావు, ఎం ఉమామహేశ్వరరావు, శీర లక్ష్మణ, లింగాల రాము, చంటి, బంగారయ్య, గౌరి నాయుడు, జి.రాధాకృష్ణ, జి.తిరుపతి, జి.కృష్ణ తదితరులు పాల్గొన్నారు

గరివిడిలో బైక్ ర్యాలీ

మహాసభలు జయప్రదం చేయాలని కోరుతూ గరివిడిలో సిఐటియు ఆధ్వర్యాన కార్మికులు బైక్ ర్యాలీ నిర్వహించారు.

బలిజిపేటలో ప్రచారం చేస్తున్న సిఐటియు నాయకులు మన్మథరావు, రెడ్డి వేణు

గరివిడి గేటు సెంటర్ నుంచి చీపురుపల్లి ఆర్డీవో ఆఫీస్ వరకు ర్యాలీ జరిగింది. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి టివి రమణ, గరివిడి మండల శాఖ ప్రధాన కార్యదర్శి ఎ. గౌరినాయుడు, పెన్షనర్ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కంది రామారావు, ఫేకర్ నాయకులు కెవి రెడ్డి, యు.ప్రకాష్, ఉనుము శ్రీను, మైన్స్ నాయకులు పిసిని అప్పలనాయుడు తాళ్లపూడి సాంబ, సూర్యనారాయణ, పిన్నింటి వీరభద్రం, బూరి సత్యం తదితరులు పాల్గొన్నారు

బలిజిపేట : విశాఖపట్నంలో జనవరి 4న జరిగే సిఐటియు బహిరంగ సభను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా ప్రధానకార్యదర్శి వై.మన్మథరావు, జిల్లా ఉపాధ్యక్షులు రెడ్డి వేణు పిలుపునిచ్చారు. మంగళవారం బలిజిపేటలో అంగన్వాడీ యూనియన్ నాయకులు దాలమ్మ, లక్ష్మితో కలిసి వారు మహాసభ కరపత్రం విడుదల చేశారు. కార్యక్రమంలో ఇందిర, ప్రమీల, స్వర్ణ, వరలక్ష్మి, లక్ష్మి, రూప, పద్మ పాల్గొన్నారు

ఆటో కార్మికులతో సమావేశం

విజయనగరంటౌన్ : 4 న విశాఖ మున్సిపల్ స్టేడియంలో (మిగతా.. 4లో)

కళ్లాల్లోనే ఉన్న ధాన్యం బస్తాలు

ధాన్యం కొనుగోలుకు

ఇ-క్రాప్ కష్టాలు

తీసుకోని కొనుగోలు కేంద్రాల సిబ్బంది

ఆందోళన చెందుతున్న రైతులు

ప్రజాశక్తి - గుర్ల

ఆరుగాలం కష్ట పడి పండించిన పంట అమ్ము కోవాలంటే రైతులకు తిప్పలు తప్పడం లేదు. రైతులకు సకాలంలో ఇ క్రాప్ పూర్తికాకపోవడంతో ఇప్పుడు ధన్యాం అమ్ముకోవడానికి ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం రైతు పండించిన ప్రతి ధాన్యం గింజా కొంటామని ప్రకటనలు చేస్తున్నప్పటికీ క్షేత్ర స్థాయిలో మాత్రం అది జరగడం లేదు. అధికారుల నిర్లక్ష్యమో పాలకుల అలసత్వమో వెరసి రైతులకు కంట తడే మిగులుతుంది. ఖరీఫ్ సీజన్‌లో వరినాట్లు వేసిన తరువాత ఏ రైతు ఎంత విస్తరణంలో వరి పంట వేసారో అన్న వివరాలను సేకరించి ఇ క్రాప్ చేయాల్సిన బాధ్యత వ్యవసాయ శాఖదే. కానీ వారు ఏ ప్రాతి పదికన ఇ క్రాప్ చేశారో ఇప్పుడు రైతులు పంటను అమ్ముకునేందుకు ఇబ్బందులు పడుతున్నారు. పండిన పంట ప్రభుత్వానికి అమ్ముకోవాలంటే పట్టాదారు పాస్ బుక్ ఉన్న వారికి ఇ క్రాప్ తప్పనిసరి. అయితే ఈ క్రాప్ తక్కువగా నమోదు కావడంతో రైతులు పండించిన పంటను అమ్ముకోవడానికి నానా యాతన పడుతున్నారు.

లక్ష్యాలు పూర్తనడంతో ఆందోళన

మరోవైపు కొనుగోలు కేంద్రాలకు ధాన్యం సేకరణ లక్ష్యాలు పూర్తయ్యాయని అధికారులు చెప్పడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. రైతుల వద్ద సరిగా ధాన్యం కొనుగోలు చేయ కుండానే లక్ష్యం ఎలా పూర్తయిందని పలువురు రైతులు ప్రశ్నిస్తున్నారు. అధికారులు తీరు చూసి ఇ క్రాప్ అయిన ధాన్యాని కూడా ప్రభుత్వం కొనదా అన్న అనుమానం రైతుల్లో నెలకొంది.

మండలంలో 11 వేల ఎకరాలు ఇ-క్రాప్ అయినట్లు అధికారులు చెబుతున్నారు. ఆ మేరకు ఆయా విస్తీర్ణంలో పండిన పంటను ప్రభుత్వం కొనుగోలు చేయాలి. కానీ ఆ స్థాయిలో కొనుగోలు జరగకుండానే ప్రస్తుతం టార్గెట్ పూర్తయిందని పై అధికారులతో మాట్లాడి టార్గెట్లు తెలియజేస్తామని అధికారులు చెప్పడం రైతులను ఒకింత ఆందోళనకు గురి చేస్తోంది. ఏది ఏమైనా రైతులకు తిప్పలు తప్పడం లేదు. పంట పండే వరకు ఒక యాతన, పండిన పంటను అమ్ముకోవడానికి మరో యాతన అని రైతుల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు, నాయకులు, మిల్లర్లు అందరూ ఏకమై రైతులను (మిగతా.. 3లో)

ఎపిఎన్‌జిఒ జిల్లా కార్యవర్గం ఎన్నిక

అధ్యక్ష, ప్రధానకార్యదర్శులుగా సురేష్, శ్రీధర్

ప్రజాశక్తి- విజయనగరం టౌన్



సురేష్, శ్రీధర్

ఆంధ్రప్రదేశ్ గెజిటెడ్ అండ్ నాన్ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ విజయనగరం జిల్లా బ్రాంచ్ ఎన్నికలు మంగళవారం స్థానిక ఎన్జీవో హోంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గం ఎన్నికైంది. జిల్లా అధ్యక్షులుగా ఎ.సురేష్, ప్రధానకార్యదర్శిగా శ్రీధర్ ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా కోనసీమ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ జిల్లా అధ్యక్షులు ఎం.వెంకటేశ్వర్లు, అసిస్టెంట్ ఎలక్షన్ ఆఫీసర్‌గా కృష్ణ, పరిశీలకులుగా రాష్ట్ర ఉపాధ్యక్షులు శ్రీనివాస్ వ్యవహరించారు. ఈ సందర్భంగా సిఎంఆర్ షాపింగ్ మాల్ నుండి ఎన్జీవో హోం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మన్యం జిల్లా అధ్యక్షులు కిషోర్ , మాజీ రాష్ట్ర ఉపాధ్యక్షులు రౌతు రామ్మూర్తి మాజీ ఎన్జీవో నాయకులు పెద్దింటి అప్పారావు, నారాయణ సత్తిరాజు, ప్రభూజీ తదితరులు పాల్గొన్నారు. ట్రెజరర్‌గా చంద్రశేఖర్, అసోసియేట్ ప్రెసిడెంట్ గా ఆదిలక్ష్మి, ఉపాధ్యక్షులుగా కె.శ్రీనివాసరావు, బి.రామారావు, ఎల్.తవుడు, కెబి శ్రీనివాసరావు, ఎ.ప్రవీణ్ కుమార్, ఎ.కళావతి, ఆర్గనైజింగ్ సెక్రటరీగా సురేష్ కుమార్, జాయింట్ సెక్రటరీలుగా కె.రాజు, ఎం.సూర్య నారాయణమూర్తి, కె.రాధిక, ఆర్.సత్యారావు, జి.అనంతరావు, ఆర్ స్వప్న ఎన్నికయ్యారు.

గ్రామకంఠం విక్రయం

- **ఖాళీ చేయాలని యజమాని హుకుం జారీ**
- **అడ్డుకున్న అడ్డూరువలస గిరిజనులు**
- **తహశీల్దార్‌కి ఫిర్యాదు**

అడ్డూరువలసలో గ్రామకంఠం భూమి ఇదే

ప్రజాశక్తి-పార్వతీపురం

మండలంలోని రావికోన పంచాయతీ అడ్డూరువలస గ్రామానికి చెందిన గ్రామకంఠం భూమిని ఓ పెద్ద మనిషి దర్జాగా విక్రయించిన ఉదంతం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. సర్వే నెంబర్ 97/10లో 83 సెంట్లు, సర్వే నెంబర్ 90/9లో 85 సెంట్ల గ్రామకంఠం భూమిని ప్రయివేటు వ్యక్తులకు రిజిస్ట్రేషన్ చేసిన వ్యవహారం బయటపడటంతో గ్రామస్తుల్లో ఆందోళన మొదలైంది. గతంలో పాలవలస పురుషోత్తం అనే డాక్టర్ ఈ గ్రామాన్ని దత్తత తీసుకుంటానని చెప్పి గ్రామస్తులతో సంతకాలు చేయించుకున్నారు. గ్రామాన్ని అభివృద్ధి చేస్తారనే నమ్మకంతో గిరిజనులు సంతకాలు చేశారు. ఆ సంతకాలతో ఆ భూమిని డాక్టర్ పురుషోత్తం రిజిస్ట్రేషన్ చేయించుని మరొకరికి విక్రయించారు. పురుషోత్తం నుంచి కొనుగోలు చేసుకున్న లింగం జయమణి అనే మహిళ గ్రామకంఠం భూమి చుట్టూ కంచె వేయడానికి ప్రయత్నించారు. అడ్డూరువలస గ్రామమంతా గతంలో అగ్నిప్రమాదంలో కాలిపోవడంతో ఆ భూమిని వదిలేసిన బాధిత గిరిజనులకు మరో చోట స్థలం కేటాయించారు. రోడ్డు అవతల ఉన్న కొంత స్థలం చూపించి అక్కడ ఇళ్లు నిర్మించుకోవాలని బాధిత కుటుంబాలకు చెప్పారు. ఆ స్థలంలో కొంతమంది గిరిజనులు ఇళ్లు నిర్మించుకున్నారు. ఆరోగ్య ఉపకేంద్రం, జిసిసి డిపో అక్కడే ఉన్నాయి. కొంతమంది గుడిసెలు వేసుకొని జీవనం సాగిస్తున్నారు. అయితే ఇటీవల ఆ స్థలం కొనుగోలుదారు వచ్చి ఖాళీ చేయాలని హుకుం జారీ చేసి కంచె వేయడానికి ప్రయత్నించగా గ్రామస్తులు.. సర్పంచ్ కద్రక రామస్వామి ఆధ్వర్యాన అడ్డుకున్నారు. గ్రామకంఠం భూమి రిజిస్ట్రేషన్ ఎలా జరిగిందని నిలదీశారు. భవిష్యత్తులో తమ పిల్లల అవసరాలకు ఉపయోగపడుతుందని పాతఊరు స్థలాన్ని ఉంచుకుంటే అక్రమ రిజిస్ట్రేషన్ చేసి విక్రయించారని గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. రెవెన్యూ రికార్డుల్లో గ్రామ కంఠంగానే ఉంది. అయితే కొనుగోలుదారుకు రెవెన్యూ అధికారులు పట్టాదారు పాసుపుస్తకాలు మంజూరు చేయడంతో భూమిపైకి వచ్చారు. దీంతో ఆందోళనకు గురైన గిరిజనులు మంగళవారం మండల తహశీల్దార్ సురేష్‌ని కలిసి వినతిపత్రం అందజేశారు. అక్రమ రిజిస్ట్రేషన్ రద్దు చేసి న్యాయం చేయాలని గిరిజనులు కోరుతున్నారు. లేకుంటే ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

నకిలీ కాల్స్ పట్ల అప్రమత్తం

ఎసిబి డైరెక్టర్ జనరల్

ప్రజాశక్తి-కంటోన్మెంట్

కొంతమంది గుర్తుతెలియని వ్యక్తులు తమను తాము ఎసిబి అధికారులుగా పరిచయం చేసుకుని ప్రభుత్వ అధికారులకు ఫోన్ కాల్స్ ద్వారా బెదిరింపులు చేస్తూ డబ్బులు డిమాండ్ చేస్తున్నట్లు గుర్తించామని రాష్ట్ర అవినీతి నిరోధక శాఖ డైరక్టరు జనరల్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విషయమై రాష్ట్రంలో అన్ని జిల్లాలకు అప్రమత్తం చేస్తూ ఒక ప్రకటన విడుదల చేశారు. ఇటీవల కాలంలో గుర్తుతెలియని వ్యక్తులు ప్రభుత్వ కార్యాలయాలకు, ప్రభుత్వ అధికారులకు ఫోన్లు చేసి నేను ఎసిబి కార్యాలయం నుంచి మట్లాడుతున్నాను. మీ మీద మాకు చాలా ఫిర్యాదులు వస్తున్నాయి. 'మీ మీద ఎసిబి రైడ్ జరగబోతుంది. ఆ రైడ్ జరగకుండా ఉండాలంటే వెంటనే ఫలనా నంబర్ కు డబ్బు పంపండి లేదా ఫలానా వ్యక్తి వస్తారు వారికి డబ్బులు ఇచ్చి పంపండి అని ఒకసారి. మరొక సారి మీ మీద ఎసిబి కేసు నమోదు అయింది దానిలో అరెస్టు చేయకుండా ఉండాలంటే డబ్బులు ఇవ్వండి అని బెదిరిస్తున్నారు' అని తెలిపారు. ఈ విషయం అవినీతి నిరోధక శాఖ, ప్రధాన కార్యాలయం దృష్టికి వచ్చినదని, అవినీతి నిరోధక శాఖ అధికారులు అటువంటి ఫోన్ కాల్స్ ఎవరికీ చేయరని తెలిపారు. ఎసిబి అధికారులు ఎట్టి పరిస్థితుల్లోనూ ఫోన్ ద్వారా డబ్బులు అడగరని (మిగతా.. 3లో)

రికార్డులను పరిశీలిస్తున్న కమిషనర్ రామచంద్రరావు

ఎక్సైజ్ పోలీసు స్టేషన్ సందర్శన

ప్రజాశక్తి - కొత్తవలస

ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కొత్తవలస స్టేషన్‌ను ఆ శాఖ అసిస్టెంట్ కమిషనర్ పి. రామచంద్రరావు వార్షిక తనిఖీలలో భాగంగా మంగళవారం సందర్శించి రికార్డులను తనిఖీ చేశారు. సిఐ జి రాజశేఖర్ నాయుడు, ఎస్ఐలు వి.నరసింహారాజు, ఎన్. రమ్యశ్రీ తగు సూచనలు చేశారు. మాదక ద్రవ్యాలు, సారాయి వంటి చట్ట వ్యతిరేకవాటిపై దృష్టి పెట్టి అక్రమ రవాణా దారులను కట్టడి చేయాలన్నారు. ఈనెల 31వ తేదీ, జనవరి 1వ తేదీన రాత్రి 12 గంటల వరకు మద్యం షాపులు తెరుచుకొని ఉంటాయని, మద్యం షాపుల ద్వారా గొలుసు దుకాణాలు నిర్వహిస్తే తగు చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న యుటిఎఫ్ నాయకులు

యుటిఎఫ్ డైరీ, కేలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి- గంట్యాడ

స్థానిక ఎంఆర్‌సి వద్ద మంగళవారం యుటిఎఫ్ డైరీ, కేలండర్లను ఎంఇఒలు బి.విజయకుమారి, ఎస్.వెంకట్రావు, యుటిఎఫ్ జిల్లా కోశాధికారి సిహెచ్ తిరుపతినాయుడులు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి.వెంకట్రావు, బి.శాంతేశ్వరరావు, గౌరవ అధ్యక్షులు బిఎస్ఎన్ పైడిరాజు, సహాధ్యక్షులు ఎస్.వినీల, కోశాధికారి ఆర్ఎన్వి మురళీధర్, కార్యదర్శులు ఏసుబాబు, శ్రీనివాస మోహన్ రామబ్రహ్మం, గుర్నాథ్, సూర్యప్రకాష్, బి.రూప, హేమలత, ఉపాధ్యాయులు విజయశ్రీ, దేవుడమ్మలు పాల్గొన్నారు.

వాహనదారులతో మాట్లాడుతున్న ఎస్ఐ సుదర్శనరావు

వాహనాలు తనిఖీ

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని వల్లంపూడి ఎస్ఐ సుదర్శనరావు తన సిబ్బందితో కలిసి మంగళవారం భద్రతా చర్యల్లో భాగంగా ద్విచక్ర వాహనాలను తనిఖీ చేశారు. గతంలో వేసిన జరిమానాలు కట్టారా లేదా అని ఆరా తీసి పాత బకాయిలను వసూలు చేశారు. 31వ తేదీ రాత్రి 10 గంటల తరువాత మూకలుగా ఉండకూడదని, మద్యం తాగి వాహనాలను నడిపితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పత్రాలు సరిగ్గా లేకపోతే కేసులు పెడతామని, హెల్మెట్ తప్పనిసరిగా వేసుకోవాలని సూచిచారు. గతంలో ఉన్న కేసులకు సంబంధించి డబ్బులు వెంటనే చెల్లించాలన్నారు. అనంతరం సింగవరం కూడలి వద్ద ద్విచక్ర వాహనాలు, ఆటోలను ఆపి తనిఖీలను నిర్వహించారు.

గిరిప్రదక్షిణకు పోటెత్తిన యాత్రికులు

ప్రజాశక్తి - నెల్లిమర్ల

రామతీర్థం రామస్వామి దేవస్థానంలో ముక్కోటి ఏకాదశిని పురస్కరించుకుని మంగళవారం నిర్వహించిన గిరి ప్రదక్షిణకు యాత్రికులు పోటెత్తారు. స్వామివారి దర్శనం కోసం భక్తులు వేకువ జాము నుంచే ఆలయానికి చేరుకున్నారు. ముక్కోటి ఏకాదశి సందర్భంగా భక్తులకు ఉత్తర ద్వారం ద్వారా దర్శనమిచ్చారు. కార్యక్రమానికి నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం నాగమాధవి, విజయనగరం ఎమ్మెల్యేల పూసపాటి అతిది గజపతి, ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు, టిడిపి నాయకులు సువ్వాడ రవి శేఖర్ హాజరయ్యారు. అనంతరం స్వామివారిని పల్లికిలో వేంచేపు చేసి తిరువీధి మహోత్సవం జరిపించి నీలాచలం కొండవద్దకు ఊరేగింపుగా తీసుకెళ్లారు. తరువాత గోపూజ నిర్వహించారు. ప్రతి మెట్టుకు పసుపురాసి బొట్టు పెట్టి మెట్లోత్సవం జరిపించారు. అనంతరం గిరి ప్రదక్షిణ కార్యక్రమాన్ని నిర్వహించారు. నీలాచలం పర్వతం చుట్టూ స్వామివారిని ప్రదక్షిణ గావించారు. కోలాట బృందాలు, చెక్కభజన బృందాలతో ఆద్యంతం శ్రీరామ స్మరణతో గిరి ప్రదక్షిణ కార్యక్రమం కొనసాగింది. దారిపొడుగునా దేవాదాయశాఖ భక్తులకు వాటర్ ప్యాకెట్లు, బిస్కెట్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. వైకుంఠ ఏకాదశి ఉత్సవాలలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భోగాపురం రూరల్ సిఐ జి.రామకృష్ణ, ఆధ్వర్యంలో నెల్లిమర్ల, డెంకాడ, పూసపాటిరేగ ఎస్ఐలు బి. గణేష్, సన్యాసినాయుడు, రామకృష్ణ, దుర్గా ప్రసాద్‌తో పాటు 60 మంది సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు. కార్యక్రమాలను ఆలయ ఇఒ వై.శ్రీనివాసరావు పర్యవేక్షించారు. అనంతరం ఎమ్మెల్యే లోకం నాగమాధవి అన్నప్రసాదం కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టిడిపి, జనసేన నాయకులు, యాత్రికలు పాల్గొన్నారు.

మెట్లోత్సవాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యేలు, రవిశేఖర్

గిరిప్రదక్షిణలో పాల్గొన్న యాత్రికలు

శృంగవరపుకోట: వైకుంఠ ఏకాదశి సందర్భంగా మండల కేంద్రంలో గల పుణ్య తిరుమల గిరి క్షేత్రంలో పద్మావతి గోదా సమేత శ్రీవెంకటేశ్వరస్వామిని ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి కుటుంబ సమేతంగా మంగళవారం దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గవర కార్పొరేషన్ డైరెక్టర్ మళ్ల రామకృష్ణ, టిడిపి మండల అధ్యక్షులు డోకుల అచ్చెం నాయుడు, పిఎసిఎస్ చైర్మన్ జి.ఎస్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

సొసైటీ చైర్మన్లుగా ప్రతీప్‌రాజు, శ్రీను

ప్రజాశక్తి- డెంకాడ

మండలంలోని డెంకాడ, జొన్నాడ సొసైటీలకు రాష్ట్ర ప్రభుత్వం చైర్మన్‌లను ప్రకటించింది. డెంకాడ సొసైటీ చైర్మన్‌గా దంతులూరి ప్రతీప్ రాజు, జొన్నాడ సొసైటీ చైర్మన్‌గా భవిరిశెట్టిశెట్టి శ్రీను (పాలు శ్రీను) ప్రకటించారు. డెంకాడ సొసైటీ టిడిపికి, జొన్నాడ సొసైటీ జనసేనకు కేటాయించారు. డెంకాడ సొసైటీ చైర్మన్ ప్రతీప్ రాజుకు రెండవసారి అవకాశం వచ్చింది. గతంలో ఒకసారి ఎన్నికల్లో గెలుపొంది సొసైటీ చైర్మన్‌గా ఎన్నికయ్యారు. మరలా ఇప్పుడు ప్రభుత్వం తననే మరోసారి చైర్మన్‌గా ప్రకటించింది. ప్రతీప్ రాజును పలువురు టిడిపి నాయకులు కార్యకర్తలు అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సొసైటీని అభివృద్ధి పథంలో నడపడానికి కృషి చేస్తానని, సొసైటీ పరిధిలో ఉన్న రైతులందరినీ ఆదుకుంటానని తెలిపారు. ఈ సొసైటీ చైర్మన్ కోసం టిడిపి నుంచి చాలా మంది పోటీపడ్డా చివరకు ప్రతీప్ రాజుకు చైర్మన్‌గా అవకాశం వచ్చింది. ఈ సొసైటీకి డైరెక్టర్లుగా పినతాడివాడ గ్రామానికి చెందిన మహంతి ఉమామహేశ్వరరావు (జనసేన) బంటుపల్లి గ్రామానికి చెందిన చిక్కాల శేషగిరిరావు (టిడిపి)కు అవకాశం ఇచ్చారు. జొన్నాడ సొసైటీ డైరెక్టర్లుగా బొడ్డవలసకు చెందిన ఎర్రచంద్రరావు (జనసేన) డి.తాళ్లవలసకు చెందిన త్రిపురగిరి సత్యనారాయణ (టిడిపి) నియమితులయ్యారు.

దంతులూరి ప్రతీప్ రాజును సత్కరిస్తున్న నాయకులు

పాలు శ్రీను

లింగ నిర్ధారణ పరీక్షల నిషేధంపై అవగాహన

ప్రజాశక్తి - పూసపాటిరేగ

మండలంలోని రెల్లివలస పిహెచ్‌సి ఆధ్వర్యంలో మంగళవారం కుమిలి గ్రామంలో లింగ నిర్ధారణ పరీక్షల నిషేధం, స్త్రీ-పురుష నిష్పత్తిలో తేడాల వల్ల సమాజంపై పడే దుష్పరిణామాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రెల్లివలస ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ ఎస్.భాగ్యరేఖ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ లింగ నిర్ధారణ పరీక్షలు చేయడం చట్టరీత్యా నేరమని, ఈ నేరానికి పాల్పడిన వారికి జరిమానాతో పాటు జైలు శిక్ష కూడా విధిస్తామని చెప్పారు. సమాజంలో ప్రతి ఒక్కరికి అవగాహన కల్పిస్తూ స్త్రీ-పురుష నిష్పత్తి తగ్గకుండా అందరూ బాధ్యతగా కృషి చేయాలని కోరారు. డిప్యూటీ హెచ్ఇఒ శివ, ఆరోగ్య కార్యకర్తలు, అంగన్వాడీ కార్యకర్తలు, స్థానికులు పాల్గొన్నారు.

విడతల వారీ ఎరువుల పంపిణీ

ప్రజాశక్తి- బొండపల్లి

మండలంలోని గరుడబిల్లి రైతు సేవా కేంద్రంలో ఎరువుల పంపిణీ కార్యక్రమాన్ని మంగళవారం జిల్లా వ్యవసాయ అధికారి వి.తారక రామారావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడతూ అధిక యూరియా వాడకం వల్ల నష్టాలు జరుగుతాయన్నారు. ప్రస్తుతం రబీ పంటకాలంలో సాగు చేస్తున్న అన్ని పంటలకూ అవసరమైన యూరియా విడతల వారీగా సరఫరా చేస్తామని అన్నారు. యూరియాకు కొరత లేదని రైతులు ఎటువంటి అపోహలకు తావివ్వకుండా అవసరం మేరకు మాత్రమే కొనుగోలు చేయాలని సూచించారు. కాగా ఎరువుల పంపిణీ విధానం ఆన్లైన్ చేస్తున్న తీరును పరిశీలించి రైతుల అభిప్రాయాలను తెలుసుకునీ సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి పివి మల్లిఖార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జిల్లా అధికారి రామారావు

శాంతియుతంగా నూతన సంవత్సర వేడుకలు

ప్రజాశక్తి- మెరకముడిదాం

మండల ప్రజల భద్రత దృష్ట్యా, శాంతి భద్రతల పరిరక్షణకు నూతన సంవత్సర వేడుకలు శాంతియుతంగా, సురక్షితంగా జరుపుకోవాలని బుధరాయవలస ఎస్ఐ జె.లోకేష్‌కుమార్ తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడపరాదని, అనుమతి లేకుండా రాత్రి వేళల్లో పార్టీలు, డిజె కార్యక్రమాలు, బైక్ ర్యాలీలు, లౌడ్ స్పీకర్ల వినియోగం చేపట్టినట్లయితే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని ఆయన మంగళవారం ఒక ప్రకనటలో హెచ్చరించారు. రోడ్లపై గుంపుగా చేరి ట్రాఫిక్ అంతరాయం కలిగించినా, ప్రమాదకరంగా వాహనాలు నడిపినా చర్యలు తప్పవని హెచ్చరించారు.

నెల్లిమర్ల: నూతన సంవత్సర వేడుకలు పేరిట కవ్వింపు చర్యలకు పాల్పడితే కేసులు తప్పవని ఎస్ఐ బి.గణేష్ హెచ్చరించారు. మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ నూతన సంవత్సరం వేడుకలు పేరిట డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టుల్లో పట్టుబడిన వారికి కచ్చితంగా జైలుకి పంపించి శిక్ష విధిస్తామని హెచ్చరించారు. రోడ్డుపై వేగంగా బైకులు నడపడం, పెద్ద పెద్ద సైలెన్సర్లతో శబ్ద కాలుష్యాన్ని పెంచడం వంటివి చేస్తే కఠిన చర్యలు ఉంటాయన్నారు. రామతీర్థం జంక్షన్, మొయిద జంక్షన్, సతివాడ తదితర గ్రామాల్లో పూర్తిస్థాయిలో డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టులు చేస్తామని ఎవరైనా పట్టుబడితే జైలు శిక్ష ఖాయమని హెచ్చరించారు.

అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయం

ప్రజాశక్తి- మెరకముడిదాం

అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని ఎమ్మెల్యే కిమిడి కళా వెంకట్రావు అన్నారు. మండలంలో పెదపూతికవలస గ్రామంలో మంగళవారం టిడిపి మండల అధ్యక్షులు తాడ్డి సన్యాసినాయుడు ఆధ్వర్యంలో రూ.32 లక్షల అంచనా విలువతో నిర్మించనున్న పంచాయతీ భవనానికి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత గ్రామీణ ప్రాంతాల అభివృద్ధిపై దృష్టి పెట్టిందన్నారు. గ్రామాల్లో ఉన్న సమస్యలు గూర్చి అడిగి తెలుసుకున్నారు. గత ప్రభుత్వం పేదలకు అన్యాయం చేసిందని చంద్రబాబు ఆధ్వర్యంలో ఏర్పాటు అయిన కూటమి ప్రభుత్వం పేదల అభ్యున్నతే ధ్యేయంగా ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం సూపర్ సిక్స్ హామీలన్నీ అమలు చేస్తోందని చెప్పారు. ఈ కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు కోట్ల మోతి నాయుడు, ఏఎంసి చైర్మన్ తాడ్డి చంద్రశేఖర్ (చందు), తహాశీల్దార్ సులోచనారాణి, ఎఒ సుధాకర్ పట్నాయక్, పిఆర్ జెఇ హరికృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే కళా వెంకటరావు

రీ సర్వేపై అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి- మెరకముడిదాం

మండలంలో ఉత్తరావిల్లి, గరుగుబిల్లి, రాచగుమడాం, మెరక ముడిదాం గ్రామాల్లో తహశీల్దార్ ఆకుల సులోచనరాణి ఆధ్వర్యంలో మంగళవారం భూ రీసర్వేపై అవగాహన ర్యాలీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రీసర్వే డిటి, సర్వేయర్, విఆర్ఒలు, విఎస్ఎస్‌లు పాల్గొన్నారు

ర్యాలీ చేస్తున్న తహాశీల్దార్

మండవకురిటి గ్రామ సచివాలయం

పింఛను డబ్బులు మాయం

● మండవకురిటిలో రూ.50 వేలు గల్లంతు

● పోలీసులకు ఫిర్యాదు

ప్రజాశక్తి - సంతకవిటి

మండలంలోని మండవకురిటి గ్రామ సచివాలయంలో పింఛన్ల పంపిణీకి తీసుకొచ్చిన నగదులో 50 వేల రూపాయలు మాయమైన ఘటన మంగళవారం కలకలం రేపింది. సర్వేయర్ సిరిపురం యూనియన్ బ్యాంక్ నుంచి మొత్తం రూ.33,45,500 నగదును తీసుకొని సచివాలయానికి వచ్చారు. పంచాయతీ సెక్రటరీ పి. సురేష్ కుమార్ ఆ మొత్తాన్ని టేబుల్‌పై ఉంచగా, సిబ్బందికి డబ్బు కట్టలు పంచుతున్న క్రమంలో 50 వేల రూపాయలు కనిపించకుండా పోయాయి. దీనిపై సిబ్బంది సిరిపురం యూనియన్ బ్యాంక్‌లోని సీసీ కెమెరాలను పరిశీలించగా, బ్యాంక్ నుంచి పూర్తి మొత్తమే అందజేసినట్లు నిర్ధారణ అయింది. దీంతో సచివాలయంలోనే ఎవరో డబ్బులు దొంగిలించి ఉంటారని అనుమానిస్తూ పంచాయతీ సెక్రటరీ పి. సురేష్ కుమార్ సంతకవిటి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ ఘటన నేపథ్యంలో ఒకటో తేదీన పింఛన్ల పంపిణీ జరుగుతుందా లేదా అన్నది ప్రశ్నార్థకంగా మారింది.

అభివృద్ధి పథంలో రాష్ట్రం

ఎమ్మెల్యే విజయ్‌చంద్ర

ప్రజాశక్తి-పార్వతీపురంటౌన్

2025 సంవత్సరంలో అభివృద్ధి పథంలో రాష్ట్రం పయనించిందని ఎమ్మెల్యే బోనెల విజయ్‌చంద్ర అన్నారు. మంగళవారం స్థానిక టిడిపి కార్యాలయంలో టిడిపి అరకు పార్లమెంట్ అధ్యక్షురాలు తేజోవతితో కలిసి విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గాడిలో పెట్టారని తెలిపారు. సూపర్ సిక్స్ పథకాలు అమలు చేసి ఎన్నికల హామీలు నెరవేర్చారని చెప్పారు. అనంతరం టిడిపి ఉత్తమ కార్యకర్తలకు ఎమ్మెల్యే విజయచంద్ర, అరకు పార్లమెంట్ అధ్యక్షురాలు తేజోవతి అవార్డులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో కొప్పల వెలమ కార్పొరేషన్ డైరెక్టర్ గొట్టాపు వెంకటనాయుడు, పెంట సత్యం, రౌతు వేణు, బోను చంద్రమౌళి, నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అవార్డులను అందజేస్సున్న ఎమ్మెల్యే విజయ్‌చంద్ర, తేజోవతి

12.83 కోట్లతో నగర పంచాయతీ బడ్జెట్

ప్రజాశక్తి-పాలకొండ

నగర పంచాయతీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన బడ్జెట్ సమావేశంలో 12.83 కోట్ల రూపాయలతో బడ్జెట్‌ను ఏకగ్రీవంగా ఆమోదించారు. నగర పంచాయతీ చైర్‌పర్సన్ ఆకుల మల్లేశ్వరి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో పలు అంశాలపై చర్చించారు. రూ.33 లక్షల మిగులు బడ్జెట్‌గా ప్రవేశపెట్టారు. దానికి సభ్యులందరూ ఏకగ్రీవంగా ఆమోదించారు. ఇటీవల అనారోగ్యంతో నగర పంచాయతీ వైస్ చైర్మన్ పల్లా ప్రతాప్ మరణించడంతో సభ్యులంతా సంతాపం తెలియజేశారు. కార్యక్రమంలో కమిషనర్ రత్నంరాజు, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు

ఆటో నుంచి జారిపడిన వ్యక్తి మృతి

ప్రజాశక్తి - శృంగవరపుకోట

పట్టణంలోని పందిరప్పన్న జంక్షన్ వద్ద ఈ నెల 25న ఆటో నుంచి జారిపడిన ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన లక్ష్మణ్ (35) చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం మృతి చెందినట్లు ఎస్.కోట సిఐ నారాయణమూర్తి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. ఆటోలో ప్రయాణిస్తున్న లక్ష్మణ్ అనుకోకుండా జారిపడటం వల్ల తలకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే అతడిని మెరుగైన వైద్యం కోసం విశాఖపట్నంలోని కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆరోగ్య పరిస్థితి విషమించడంతో మృతి చెందాడు. ఘటనపై మృతుని అన్న రాము ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

కాలిపోతున్న చెరకు తోట

5 ఎకరాల చెరకుతోట దగ్ధం

ప్రజాశక్తి-బలిజిపేట

మండలంలోని చాకరాపల్లిలో మంగళవారం సంభవించిన అగ్ని ప్రమాదంలో ఐదు ఎకరాల చెరకుతోట దగ్ధమైంది. అజ్జాడ పంచాయతీ మురగడం గ్రామానికి చెందిన మరిశర్ల వెంకటనాయుడుకు చాకరాపల్లి గ్రామంలో వ్యవసాయ భూమి ఉంది. అందులో ఐదు ఎకరాల్లో చెరకు పంట వేశాడు. మంగళవారం మధ్యాహ్నం పక్క పొలంలో గుర్తు తెలియని వ్యక్తులు వరిగడ్డికి నిప్పు పెట్టారు. గాలులకు మంటలు పక్కనే ఉన్న చెరకు పంటకు వ్యాపించి కాలిపోయినట్లు స్థానిక రైతులు తెలిపారు. ఈ ఘటనపై బాధితుడు వెంకట్ నాయుడు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశాడు.

16 గడ్డివాములు దగ్ధం

ప్రజాశక్తి-మక్కువ

మండలంలోని ఎ.వెంకంపేట గ్రామంలో మంగళవారం సాయంత్రం 16 గడ్డివాములు దగ్ధమయ్యాయి. పెంట నరసంనాయుడు, రమేష్ మృత్యుంజయ, చిన్న ఈశ్వరరావు, ఈశ్వరమ్మ, పెద్ద ఈశ్వరరావు, తవిటినాయుడు, అంబటి శివలకు చెందిన గడ్డివాములుగా గుర్తించారు. ప్రమాద సమాచారం అందుకున్న వెంటనే బొబ్బిలి అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేశారు. అగ్ని ప్రమాదానికి గల కారణాలు తెలియాల్సి ఉంది.

చెత్త రహిత గ్రామంగా తీర్చిదిద్దేందుకు ప్రణాళిక

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

గుమ్మలక్ష్మీపురాన్ని చెత్త రహిత గ్రామంగా తీర్చిదిద్దేందుకు సమగ్ర ప్రణాళికను సిద్ధం చేసినట్లు సర్పంచ్ బి.గౌరీశంకర్రావు తెలిపారు. మంగళవారం పంచాయతీ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. రెండు వారాలుగా గుమ్మలక్ష్మీపురం మెయిన్ రోడ్డులో పైలట్ ప్రాజెక్ట్‌గా చెత్త సేకరణ కార్యక్రమం విజయవంతంగా నిర్వహించినట్లు ఆయన తెలిపారు. ఈ అనుభవాన్ని ఆధారంగా తీసుకొని, ఇకపై గ్రామమంతా చెత్త సేకరణ కార్యక్రమం అమలు చేయడానికి ప్రణాళిక రూపొందించినట్లు చెప్పారు. సమావేశంలో పంచాయతీ కార్యదర్శి శ్రీకాంత్, ఇంజినీరింగ్ అసిస్టెంట్ గోపాల్, శబరిమాత స్వచ్ఛంద సేవా సంస్థ చెత్త సేకరణ మండల కోఆర్డినేటర్లు బి. సూర్యం, గ్రామపంచాయతీ ఫీల్డ్ నిర్వాహకులు ప్రసాద్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

డ్రోన్‌తో పిచికారీ సులభతరం

డ్రోన్‌తో పురుగుల మందు పిచికారీని పరిశీలిస్తున్న ఎఒ తిరుపతిరావు

ప్రజాశక్తి-పాచిపెంట

డ్రోన్ సహాయంతో పురుగుమందులు పిచికారి చేయడం సులభమని మండల వ్యవసాయ అధికారి కె.తిరుపతిరావు తెలిపారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా కొత్తవలస గ్రామంలో రైతు బొంగు శ్రీనివాసరావు మొక్కజొన్న పొలంలో మంగళవారం డ్రోన్ ద్వారా పురుగు మందులు పిచికారీ చేపట్టారు. డ్రోన్ ద్వారా నానో యూరియాతో కలిపి పిచికారీ చేసుకుంటే పురుగుమందులు ప్రభావవంతంగా పనిచేస్తాయని ఎఒ తెలిపారు. తక్కువ ఖర్చుతో, తక్కువ సమయంలో పిచికారీ పూర్తవుతుందని చెప్పారు. ఎన్నో ప్రయోజనాలు ఉన్న డ్రోన్‌ను 80 శాతం సబ్సిడీపై ప్రభుత్వం అందించిందన్నారు. రైతులు డ్రోన్ ద్వారా పిచికారీ చేసుకోవాలంటే డ్రోన్ పైలెట్ (7981374938)ను సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు వేణు, సిఆర్‌పి తిరుపతి పాల్గొన్నారు.

మొదటి పేజీ తరువాయి

ధాన్యం కొనుగోలుకు ఇ- క్రాప్ కష్టాలు

ఇబ్బందులకు గురి చేస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. కొండగంగ్రేడు, పల్లిగంగ్రేడు, పకీరుకిట్టాలి సచివాలయాల పరిధిలో ధాన్యం కొనుగోలు సమస్య ఎక్కువగా వుందని రైతులు బహిరంగంగానే చెబుతున్నారు. అధికారులు చొరవ తీసుకుని ఇ క్రాప్‌తో సంబంధం లేకుండా రైతులు పండించిన పంటను కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలని పలువురు రైతులు కోరుతున్నారు.

నకిలీ కాల్స్ పట్ల అప్రమత్తం

స్పష్టం చేశారు. ఇలాంటి నకిలీ, మోసపూరిత కాల్స్‌కు అధికారులు ఎవరూ స్పందించకూడదని సూచించారు. ప్రభుత్వ అధికారులు ఇటువంటి ఫేక్ కాల్స్ పట్ల అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ఇటువంటి బెదిరింపు కాల్స్ వచ్చినట్లయితే వెంటనే స్థానిక పోలీసులకు, ఎసిబి టోల్ ఫ్రీ నెంబరు 1064 కు తెలియపరచి సమాచారం ఇవ్వాలని తెలిపారు.

తమ్మినాయుడు పాఠశాలలో సైన్స్ ఫెయిర్

ప్రజాశక్తి-పాలకొండ

తమ్మినాయుడు కాన్సెప్ట్ పాఠశాలలో మంగళవారం ప్రజ్ఞా సైన్స్ ఫెయిర్‌ను నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని విద్యా సంస్థల అధ్యక్షులు శెట్టి నారాయణమ్మ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నేటి విద్యార్థుల రేపటి శాస్త్రవేత్తలు కావాలని ఆకాంక్షించారు. ఇలాంటి సైన్స్‌ఫెయిర్లను విద్యార్థులు వినియోగించుకొని పరిశోధన, శాస్త్రీయ దృక్పథాన్ని పెంచుకోవాలని సూచించారు. 74 ప్రాజెక్టులను విద్యార్థులు ప్రదర్శించారు. నీటి యాజమాన్యం, నీటి సంరక్షణ, మట్టి సంరక్షణ, వాయు కాలుష్యం, పర్యావరణ పరిరక్షణ తదితర ప్రాజెక్టుల ద్వారా విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ శ్రీనివాస్ నాయుడు, తిరుపతిరావు, అధ్యాపకులు యామిని, అనిల్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఏర్పాటుచేసిన ప్రాజెక్టుతో విద్యార్థులు

సచివాలయానికి బోర్డు ఏదీ?

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

జియ్యమ్మవలస మండలం గవరంపేట సచివాలయ భవనానికి కనీసం బోర్డు పెట్టకుండా నిర్వహిస్తున్నారని గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కూరంగి సీతారాం అన్నారు. గిరిజనుల సమస్యలపై గ్రామాల్లో సర్వే చేస్తున్న సందర్భంలో గవరంపేట గ్రామాన్ని మంగళవారం ఆయన సందర్శించారు. సచివాలయానికి కనీసం బోర్డు లేకపోవడంతో ఆయన ఆశ్చర్యం వ్యక్తంచేశారు. మధ్యాహ్నం 3.30 గంటలకు సచివాలయంలో ఒక్కరూ లేరని ఆయన అసహనం వ్యక్తంచేశారు. ఇప్పటికైనా సచివాలయం పేరుతో బోర్డు ఏర్పాటు చేసి, సిబ్బంది సమయపాలన పాటించేలా చర్యలు తీసుకోవాలని ఆయన ఉన్నతాధికారులను కోరారు.

వేరుశనగ విత్తనాలను వినియోగించుకోవాలి

ప్రజాశక్తి - కురుపాం

వేరుశనగ విత్తనాలను ప్రతిఒక్క రైతూ సద్వినియోగం చేసుకోవాలని ఎఒ పి.నాగేశ్వరరావు సూచించారు. మంగళవారం మండలంలో వలసబల్లేరు రైతు సేవా కేంద్రంలో రైతులకు వేరుశనగ విత్తనాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కృషి విజ్ఞాన కేంద్ర సమన్వయకర్త డాక్టర్ ఎస్.ధ్రువ పాల్గొని వేరుశనగ పంటపై వచ్చే తెగుళ్ళు, సస్యరక్షణ పద్ధతులు, పిచికారి విధానాల, డ్రోన్ సహాయంతో పిచికారి చేయడం వంటి ఆధునిక పద్ధతులను రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సచివాలయం సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఏడుగురిపై బైండోవర్ కేసులు

ప్రజాశక్తి-బలిజిపేట

అక్రమంగా మద్యం, సారా అమ్ముతున్న ఏడుగురిపై బైండోవర్ కేసులు నమోదు చేసినట్లు ఎక్సైజ్ సిఐ పద్మావతి తెలిపారు. వివిధ కేసుల్లో పట్టుబడిన వీరిని మంగళవారం తహశీల్దారు ఎదుట హాజరు పరచగా వారిపై బైండోవర్ కేసులు నమోదు చేశారు. వీరు ఏడాదిలోగా మద్యం విక్రయిస్తూ పట్టుబడితే లక్ష రూపాయల జరిమానా, ఏడాది జైలు శిక్ష విధించనున్నట్లు సిఐ హెచ్చరించారు.

వివిధ కేసుల్లో పట్టుబడిన వారితో మాట్లాడుతున్న తహాశీల్దార్

గరివిడిలో బైక్ ర్యాలీ చేపడుతున్న సిఐటియు నాయకులు టివి రమణ, తదితరులు

సాలూరులో ప్రచారం చేస్తున్న సిఐటియు నాయకులు ఎన్‌వై నాయుడు, అంగన్వాడీ యూనియన్ నాయకులు, అంగన్వాడీలు

భోగాపురంలో ప్రచారం చేస్తున్న సిఐటియు నాయకులు, కార్మికులు

సిఐటియు మహాసభల జయప్రదానికి

విస్తృత ప్రచారం

(మొదటి పేజీ తరువాయి)

జరిగే బహిరంగ సభకు ఆటో డ్రైవర్లు తరలి రావాలని సిఐటియు నగర అధ్యక్ష, కార్యదర్శులు ఎ.జగన్ మోహన్ రావు, బి.రమణ, ఆటో యూనియన్ నాయకులు బొమ్మన పాపారావు పిలుపునిచ్చారు. స్థానిక కోట జంక్షన్, లెండి ఇంజనీరింగ్ కాలేజీల వద్ద ఆటో డ్రైవర్లతో జరిగిన సమావేశం లో వారు మాట్లాడారు. ఆటో యూనియన్ నాయకులు జి.కుర్మారావు, లక్ష్మణరావు, రామారావు, డి.ఎల్, రాజు, అప్పలనాయుడు, రమణ, రామునాయుడు తదితరులు పాల్గొన్నారు.

మెంటాడ : మహాసభను జయప్రదం చేయాలని మండలంలోని లోతుగెడ్డ గ్రామంలో ప్రచారం చేశారు. కార్యక్రమంలో కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి రాకోటి రాములు, ఐద్వా జిల్లా కమిటీ సభ్యులు సిహెచ్ కృష్ణవేణి, పావని, పరశురాము, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

శృంగవరపుకోట : విశాఖలో జరగనున్న సిఐటియు 18వ జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా పూర్య కార్యదర్శి చల్లా జగన్ ఆధ్వర్యంలో లక్కవరపుకోటలో మంగళవారం ఆటోతో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ రంగాన్ని పూర్తిగా నిర్వీర్యం చేస్తున్న మోడీ విధానాలను ఖండించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల అధ్యక్షులు తరణి వెంకటరమణ, సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు చెలికాని ముత్యాలు, అంగనవాడి వర్కర్లు, మధ్యాహ్న భోజన కార్మికులు పాల్గొన్నారు.

సంతకవిటి: సిఐటియు మహా సభలను జయప్రదం చేయాలని కోరుతూ సిఐటియు జిల్లా కార్యదర్శి ఎం.త్రినాధ్, మండల కన్వీనర్ కె.అసిరప్పుడు ఆధ్వర్యంలో మంగళశారం సంతకవిటి, మందరాడ, మండవకురిటి, అప్పలఅగ్రహారం, సిరిపురం, వాల్తేరు, తాలాడ తదితర గ్రామాల్లో ఆటో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు ద్వారా పెండింగ్‌లో ఉన్న క్లెయిమ్స్‌ను వెంటనే మంజూరు చేయాలని, సంక్షేమ పథకాలను కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వై.ఆనంద్, ఎల్. లక్ష్మణరావు, బి. వెంకటరావు, నారాయణరావు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

భోగాపురం: సిఐటియు అఖిల భారత మహాసభలకు తరలి రావాలని సిఐటియు నాయకులు బి.సూర్యనారాయణ పిలుపునిచ్చారు. ఈ నేపథ్యంలో మంగళవారం ముక్కాం కూడలి వద్ద ఆటో ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఈ నెల 31 నుంచి జనవరి 4వ తేదీ వరకు విశాఖపట్నంలో 18వ అఖిల భారత మహాసభలు జరగనున్నాయని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఒనం రమణ, ఎద్దు అప్పారావు, పిట్ట రామసూరి, శ్రీను, రాము తదితరులు పాల్గొన్నారు.

డెంకాడ: మండలంలోని అక్కివరం హేచరీ వద్ద సిఐటియు అఖిలభారత మహాసభల సందర్భంగా మంగళవారం ఆటో ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి బి.సూర్యనారాయణ, బి.నర్సినాయుడు, ఎన్. సూర్యనారాయణ, జి.పెంటరాజు, డి.సోమరాజు తదితరులు పాల్గొన్నారు.

మెంటాడ, దత్తిరాజేరులో ప్రచారం చేస్తున్న సిఐటియు నాయకులు, ఆటో కార్మికులు

గరుగుబిల్లి, సంతకవిటిలో ప్రచారం చేస్తున్న సిఐటియు నాయకులు, కార్మికులు

పార్వతీపురం : జనవరి 4న విశాఖపట్నంలో నిర్వహించనున్న సిఐటియు ర్యాలీ, బహిరంగ సభలను విజయవంతం చేయాలని ఆ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షులు రెడ్డి వేణు కోరారు. మండలంలోని అడ్డాపుశిల పంచాయతీలో ఎఫ్‌సిఐ గోడౌన్, స్థానిక రైస్ మిల్లుల్లో మంగళవారం నిర్వహించిన ప్రచార సభల్లో వేణు, జిల్లా కోశాధికారి గొర్లి వెంకటరమణ, ఎపి రైతుసంఘం జిల్లా కార్యదర్శి బంటు దాసు మాట్లాడారు. సిఐటియు అఖిలభారత మహాసభలు విశాఖపట్నంలో మొదటిసారి జరుగుతున్నాయని తెలిపారు. ఈ మహాసభల జయప్రదానికి కార్మిక వర్గం, ప్రజలు సహకరించాలని పిలుపునిచ్చారు. హమాలీ నాయకులు అక్కెన శంకరరావు, వంగల జనార్ధన, ఎన్.రాము, బంటు శివున్నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

పాలకొండ : సిఐటియు జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు దావాల రమణారావు ఆధ్వర్యాన పాలకొండలో మంగళవారం ప్రచారం చేశారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఎన్. హిమప్రభ, అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ ప్రతినిధులు జి.శారద, ఎస్.గంగమ్మ, సీత, లలిత, తదితరులు పాల్గొన్నారు.

సాలూరు : సిఐటియు జాతీయ మహాసభలను విజయవంతం చేయాలని సాలూరు మండలంలోని తోణాంతోపాటు సాలూరు పట్టణంలో ప్రచార కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్‌వై నాయుడు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ఎం.శ్రీను, అంగన్వాడి యూనియన్ ప్రాజెక్టు కార్యదర్శి గౌరీశ్వరి మాట్లాడుతూ జనవరి 4న విశాఖలో జరిగే బహిరంగ సభకు కార్మిక వర్గం హాజరై జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు మరియమ్మ, సుజాత, నారాయణమ్మ, ఇందిర, పోలమ్మ తదితరులు పాల్గొన్నారు.

కొమరాడ : మండలంలోని రాజ్యలక్ష్మీపురం అంగన్వాడీ సెక్టార్ వద్ద సిఐటియు నాయకులు కె.సాంబమూర్తి ఆధ్వర్యాన కరపత్రాలను విడుదల చేశారు. చలో విశాఖ బహిరంగ సభకు తరలిరావాలని ఆయన కోరారు. కార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ నాయకులు పుష్ప, అలివేలు, తదితరులు పాల్గొన్నారు.

గరుగుబిల్లి : విశాఖపట్నంలో జనవరి 4న జరిగే సిఐటియు బహిరంగ సభకు తరలిరావాలని సిఐటియు జిల్లా కార్యదర్శి బి.వి.రమణ కోరారు. మంగళవారం గరుగుబిల్లిలో పంచాయతీ కార్మికులు, గ్రామ రెవెన్యూ సహాయకుల ఉమ్మడి సమావేశం నిర్వహించి, చలో విశాఖకు సమాయత్తం చేశారు. కార్యక్రమంలో గ్రీన్ అంబాసిడర్ల యూనియన్ నాయకులు పాలక వెంకటి, పి.గోపాల్, జి.శ్రీనివాస్, విఆర్ఎల సంఘం నాయకులు అప్పలస్వామి, శాంతి తదితరులు పాల్గొన్నారు.

కొమరాడ, శృంగవరపుకోటలో ప్రచారం చేస్తున్న సిఐటియు నాయకులు, అంగన్వాడీలు

పుస్తక పఠనంతోనే విజ్ఞానం : సినీ నటి రోహిణి

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ

పుస్తకపఠనంతోనే విజ్ఞానం అభివృద్ధి చెందుతుందని, ప్రస్తుత యువత సెల్‌ఫోన్లవి వినియోగంలో పడి పుస్తకాలకు దూరమవుతున్నారని ప్రముఖ సినీ నటి రోహిణి అన్నారు. సిఐటియు 18వ జాతీయ మహాసభలు సందర్భంగా స్థానిక ఎయు ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో "శ్రామిక ఉత్సవ్" పేరిట నిర్వహిస్తున్న సాంస్కృతిక కార్యక్రమాలు విశేష ఆకర్షణగా నిలిచాయి. ఈ సందర్భంగా ఆమె అక్కడి పుస్తక మహోత్సవం, సైన్స్ ఎగ్జిబిషన్, ఫొటో ప్రదర్శనలను ఆసక్తిగా తిలకించారు.

పుస్తకాలకు దూరమవుతున్న యువత

పుస్తక ప్రదర్శనను సందర్శించిన అనంతరం రోహిణి మాట్లాడుతూ ఆధునిక యుగంలో సాంకేతికత పెరిగి యువత ఎలక్ట్రానిక్ పరికరాలకే పరిమితమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనివల్ల పుస్తక పఠనం తగ్గిపోతోందని, ఇలాంటి తరుణంలో ప్రజలను మళ్లీ పుస్తకాల వైపు మళ్లించేందుకు నిర్వాహకులు చేస్తున్న కృషి అభినందనీయమని కొనియాడారు. ఆమె స్వయంగా పలు పుస్తకాలను పరిశీలించి, వాటి విశిష్టతలను అడిగి తెలుసుకున్నారు.

ఆలోచింపజేసే కార్టూన్లు

కార్టూన్ ప్రదర్శనను వీక్షించిన రోహిణి, భావవ్యక్తీకరణకు కార్టూన్లు అత్యంత శక్తివంతమైన మాధ్యమాలని పేర్కొన్నారు. గతంలో దినపత్రికల్లో ప్రతిరోజూ కార్టూన్లు వచ్చేవని, కానీ ఇప్పుడు అవి తగ్గుముఖం పట్టడం బాధాకరమని ఆవేదన వ్యక్త చేశారు. యువత ఈ కళకు కూడా దూరమవుతోందని వ్యాఖ్యానించారు. అనంతరం సైన్స్, ఫోటో ఎగ్జిబిషన్‌ల్లోని ప్రదర్శనలను చూసి అక్కడి ప్రత్యేకతలను ఆశ్చర్యంతో వీక్షించారు.

షార్ట్ ఫిలింలే రేపటి పునాది

ఈ ఉత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన షార్ట్ ఫిలిం స్క్రీనింగ్‌లో 'జయహే' అనే లఘు చిత్రాన్ని ఆమె వీక్షించారు. ఈ సందర్భంగా యువ కళాకారులను ఉద్దేశించి మాట్లాడుతూ "నేటి తరం దర్శకులందరికీ షార్ట్ ఫిలింలే పునాదన్నారు. యువత కొత్త ఆలోచనలతో చిత్ర నిర్మాణ రంగంలోకి రావాలని ఆమె పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నిర్వాహకులు, ప్రజలు విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

పుస్తక ప్రదర్శనను తిలకిస్తున్న సినీ నటులు రోహిణి, మాదాల రవి

రాజకీయ దృక్పథంతోనే అభ్యుదయ సాహిత్యం

గురజాడ అజెండాను అమలు చేసి చూపించిన శ్రీశ్రీ

కవి, రచయిత అట్టాడ అప్పలనాయుడు

ప్రజాశక్తి - ప్రత్యేక ప్రతినిధి

సరైన రాజకీయ దృక్పథం, వర్గదష్టితోనే అభ్యుదయ సాహిత్యం సాధ్యమవుతుందని ప్రముఖ కవి, రచయిత అట్టాడ అప్పలనాయుడు అన్నారు. ఇటువంటి ప్రయత్నంలో మహాకవి గురజాడ అజెండా సెట్ చేస్తే శ్రీశ్రీ, కాళీపట్నం రామారావు తదితర కవులు వాటిని మరింత ముందుకు తీసుకెళ్లారని వివరించారు. సిఐటియు 18వ అఖిలభారత మహాసభల సందర్భంగా స్థానిక ఎయు ఎగ్జిబిషన్ మైదానంలో శ్రామిక ఉత్సవ్ అనే కార్యక్రమం జరుగుతున్న సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా ఏర్పాటు చేసిన శ్రామిక సాహిత్య వేదికలో 'అభ్యుదయ సాహిత్య భావధార' అన్న అంశంపై అరసం విశాఖ జిల్లా అధ్యక్షులు ఉప్పల అప్పలరాజు అధ్యక్షతన మంగళవారం చర్చాగోష్టి జరిగింది. ఈ సందర్భంగా అప్పలనాయుడు మాట్లాడుతూ సమాజంలో ఎన్నో రకాల సాహిత్యం ఉన్నప్పటికీ, అభ్యుదయ సాహిత్యం ప్రత్యేకమైందని వివరించారు. ప్రధానంగా ఈ తరహా సాహిత్యం 1930 నుంచి 1955 మధ్య విరివిగా అందుబాటులోకి వచ్చిందన్నారు. ఆ కాలంలో ప్రపంచ దేశాల్లో మారిన పరిస్థితులు, సంఘర్షణ కవులు, రచయితలపై తీవ్ర ప్రభావం చూపడమే ఇందుకు కారణమన్నారు. ఆ కాలంలోనే రష్యాపై దాడి జరుగుతున్న నేపథ్యంలో 'గర్జించు రష్యా... గాండ్రించు రష్యా' అంటూ శ్రీశ్రీ తన కవితలతో ప్రపంచంలో మారుతున్న రాజకీయ పరిస్థితులను, అందులో మంచి చెడులను జనానికి అర్థమయ్యే రీతిలో చెప్పారని గుర్తు చేశారు. 'ఏడవకండేడవకండి! ... ఏడవకండి.. ఏడవకండి! ఓ వ్యధా నినిష్టులారా! ఓ కథా వశిష్టులారా! పతితులారా! భ్రష్టులారా! బాధాసర్పదష్టులారా! ఏడవకం డేడవకండి! ... జగన్నాధ రథచక్రాలు వస్తున్నాయి' అంటూ పీడిత ప్రజానీకానికి ఆయన అండగా నిలిచారని కొనియాడారు. చాసో అభ్యుదయ కథలు కూడా జనాల్లోకి బాగా వెళ్లాయన్నారు. శ్రీశ్రీ, చాసోలపై గురజాడ అభ్యుదయ రచనల ప్రభావం ఉండడం వల్ల సమాజాన్ని ప్రభావితం చేయగలిగే కవితలు, రచనలు వీరు చేశారని అన్నారు. వీరితో పాటు అనేకమంది కవులు, రచయితలు తెలుగు నాట అభ్యుదయ సాహిత్యానికి పెద్దపీట వేశారని వివరించారు. కవి, సాహితీవేత్త డాక్టర్ జివిఎస్ జయపాలరావు మాట్లాడుతూ అభ్యుదయ సాహిత్యంలో గురజాడ మానవతావాదాన్ని ఎంచుకుంటే, రష్యా విప్లవం ప్రభావంతో శ్రీశ్రీ మానవహక్కులను ప్రధానాంశంగా తీసుకుని ముందుకు నడిపారన్నారు. రైతులు, కార్మికులు, దళితులు, పేదలు, గిరిజనుల ఈతి బాధలు, ఆశలు, ఆకాంక్షలు వీరిద్దరి అభ్యుదయ సాహిత్యంలో ఉన్నాయన్నారు. స్వాతంత్ర్య అనంతరం, ప్రజాస్వామ్య విలువలు, లౌకిక, శాస్త్రీయ దృక్పదం వంటి భావాలు కూడా అభ్యుదయ సాహిత్యంలో ఇమిడిపోయాయన్నారు. సమకాలీన పరిస్థితుల్లో అభ్యుదయ సాహిత్యం కొత్తరూపంలో కొనసాగుతోందన్నారు. గ్లోబలైజేషన్, ప్రైవేటైజేషన్, కార్పొరేట్ సంస్కృతి వంటి ఆధునిక భావాల్లో లోపాలను కూడా ఇది ప్రశ్నిస్తోందన్నారు. ప్రస్తుత రాజకీయ పరిస్థితులను ఉటంకిస్తూ "ప్రస్తుతం పాలకుల యొక్క భావజాలం... పులిరాజు భావజాలం.. గొంగడి పురుగు చిత్ర విచిత్ర వేషాలు.. అల్పబుద్ధి కోతుల విన్యాసాలు.. ఊసరవల్లి పార్టీల మార్పులు.. గొర్రెల మందకు చెప్పే తోడేళ్ల కబుర్లు... గాలివార్తలు వెదజల్లే పిల్లులు... నేటి రాజకీయంలో నాయకుల అవసరాలు... అంటూ రాజకీయ ముసుగులో చేస్తున్న స్వార్థాన్ని వివరించారు. ఈ తరుణంలో సమాజానికి అభ్యుదయ సాహిత్య అవసరం ఎంతో ఉందన్నారు. బానిసత్వానికి వ్యతిరేకంగా పుట్టిన అది అంతమయ్యే వరకు కొనసాగుతుందన్నారు. అనంతరం అరసం విశాఖ జిల్లా ఉపాధ్యక్షులు సర్వసిద్ధి హనుమతరావు మాట్లాడారు. వీరికి సాహితీ స్రవంతి రాష్ట్ర కార్యదర్శి చీకటి దివాకర్ చేతులమీదుగా శ్రమ అవార్డులు ప్రదానం చేశారు.

శ్రమ అవార్డులతో అట్టాడ అప్పలనాయుడు, జయపాలరావు, తదితరులు, చిత్రంలో ఎంవిఎస్.శర్మ

లఘు చిత్రాలు.. పెద్ద సందేశాలు

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ

సిఐటియు 18వ జాతీయ మహాసభలు సందర్భంగా స్థానిక ఎయు ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో "శ్రామిక ఉత్సవ్" పేరిట నిర్వహిస్తున్న సాంస్కృతిక కార్యక్రమాలు నాలుగో రోజు మంగళవారం ప్రదర్శించిన లఘు చిత్రాలు సామాజిక చైతన్యాన్ని, సమకాలీన సమస్యలను ఎంతో శక్తివంతంగా ఆవిష్కరించాయి. ప్రముఖ నటీనటులు రోహిణి, మాదాల రవి ఈ చిత్రాలను ప్రత్యక్షంగా వీక్షించి లఘు చిత్ర దర్శకులను అభినందించారు. మంగళవారం జరిగిన ప్రదర్శనలో 7 చిత్రాలు ప్రదర్శించారు.

- విశాఖపట్నంకు చెందిన శంకర్ దర్శకత్వం వహించిన మై ఓటు నాట్ ఫర్ సేల్ లఘు చిత్రం ప్రజాస్వామ్యంలో ఓటు అనేది వజ్రాయుధం. కానీ నేటి రాజకీయాల్లో ఓటును నోటుకు అమ్ముకోవడం వల్ల ప్రజలు తమ ఐదేళ్ల భవిష్యత్తును ఎలా తాకట్టు పెడుతున్నారో ఈ చిత్రం కళ్లకు కట్టినట్లు చూపింది.
- విశాఖపట్నం కు చెందిన సుదీప్ సాయి దర్శకత్వం వహించిన లఘు వైజాగ్ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ అంశంపై తీసిన ఈ చిత్రం ప్రస్తుతం ఎంతో ప్రాధాన్యత కలిగింది. స్టీల్ ప్లాంట్ కేవలం ఒక ఫ్యాక్టరీ మాత్రమే కాదు, వేలాది కుటుంబాల జీవనాధారం, విశాఖ ప్రజల ఆత్మగౌరవం అని ఇందులో వివరించారు.
- వివిఎస్ఎఫ్ఎం నిర్మించిన 100వ అల్లూరి లఘు చిత్రంలో అల్లూరి సీతారామరాజు పోరాట స్ఫూర్తి నేటి తరానికి ఎంత అవసరమో ఈ చిత్రం చాటిచెప్పింది. కేవలం చరిత్ర పుస్తకాల్లోనే కాకుండా, నేటి అన్యాయాలపై గొంతెత్తే ప్రతి ఒక్కరిలోనూ అల్లూరి ఉండాలని ఉద్బోధించింది.
- విశాఖపట్నం కు చెందిన కె.మహేష్ బాబు దర్శకత్వం వహించిన అన్సంగ్ హీరోస్ లఘు చిత్రం మన నగరాన్ని శుభ్రంగా ఉంచే మున్సిపాలిటీ వర్కర్ల (పారిశుధ్య కార్మికుల) జీవితాలను చిత్రీకరించిన డాక్యుమెంటరీ ఇది. వారు పడుతున్న ఆరోగ్య సమస్యలు, సామాజిక వివక్ష మరియు వారి నిస్వార్థ సేవను ఇందులో చూపారు.
- ఫ్యుబె క్రియేషన్ నిర్మాణం రూపొందించిన ఎఫ్-2 లఘు చిత్రం నిరుద్యోగ సమస్యతో సతమతమవుతున్న నేటి యువత ప్రతినిధిగా ఒక యువకుడి పాత్రను ఇందులో చూపారు. చదువు పూర్తి చేసి ఉద్యోగం కోసం అతను పడే ఆవేదన, ఎదుర్కొనే సవాళ్లు ప్రతి నిరుద్యోగిని ఆలోచింపజేస్తాయి.
- విశాఖపట్నంకు చెందిన పి.రమేష్ కుమార్ దర్శకత్వం వహించిన జయహే లఘు చిత్రం మత సామరస్యంపై తీసిన సందేశాత్మక చిత్రం. కుల, మతాల కంటే మానవత్వం గొప్పదని, వైవిధ్యంలో ఏకత్వం కలిగిన భారతదేశంలో అంతా కలిసి ఉండాలని ఈ చిత్రం ప్రబోధించింది.
- చివరిగా విశాఖపట్నం కు చెందిన దామోదర్ దర్శకత్వం వహించిన యుద్ధం ప్రకటించు లఘు చిత్రం యువతను పట్టి పీడిస్తున్న అతి పెద్ద సమస్య 'మత్తు' మాయదారి మత్తులో పడి జీవితాలను ఎలా పాడుచేసుకుంటున్నారో చూపిస్తూ, ఆ అలవాట్లపై యుద్ధం ప్రకటించాలని పిలుపునిచ్చింది.
- ప్రదర్శన అనంతరం "ఇది ఆరంభం" అనే షార్ట్ ఫిలిం పోస్టర్‌ను రోహిణి, మాదాల రవి ఆవిష్కరించారు. భవిష్యత్తులో కార్మిక, సామాజిక సమస్యలపై మరిన్ని చిత్రాలు రాబోతున్నాయని అసోసియేషన్ స్పష్టం చేసింది. ఈ చిత్రాలన్నీ కేవలం కళాఖండాలుగా మాత్రమే కాకుండా, సమాజాన్ని మార్చే ఆయుధాలుగా నిలుస్తాయని తెలిపింది.

'ఇది ఆరంభం' షార్ట్ ఫిల్మ్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న రోహిణి, మాదాల రవి

ప్రజాశక్తి
www.prajasakti.com
విశాఖపట్నం, అనకాపల్లి
బుధవారం 31 డిసెంబర్ 2025

ప్రధాన వేదిక ఏర్పాట్లను పరిశీలిస్తున్న సిఐటియు అఖిల భారత అధ్యక్షులు హేమలత

ఉత్సాహం.. ఉత్తేజం

సందడిగా శ్రామిక ఉత్సవ్
నాలుగో రోజూ జనతాకిడి
ఆకట్టుకున్న కళాకారుల ప్రదర్శనలు

సిఐటియు అఖిల భారత మహాసభ నేపథ్యంలో మంగళవారం సాయంత్రం ఎయు ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో శ్రామిక ఉత్సవ్‌లో భాగంగా తలపెట్టిన కళా, సాంస్కృతిక ప్రదర్శనలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఫొటో, కార్టూన్, సైన్స్ ఎగ్జిబిషన్లను చూసేందుకు యువత తరలివచ్చారు. మంగళవారం నాటి ఉత్సవ్‌లో సినీ నటులు రోహిణి, మాదాల రవి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. వారిరువురూ ఉత్సవ్‌లోని అన్ని స్టాల్స్‌నూ కలియదిరిగారు. ఉత్సవ్ ప్రధాన వేదికపై వారు చేసిన ప్రసంగం అందరినీ ఆకట్టుకుంది. ఎర్రజెండా గొప్పతనాన్ని తెలియజేసింది. వారి మాట్లాడుతున్నంతసేపూ చప్పట్ల వర్షం కురిసింది.

CITU
18TH ALL INDIA CONFERENCE
2025 DEC 31 - 2026 JAN 4, VISAKHAPATNAM

డ్యాన్సులతో ఆకట్టుకున్న చిన్నారులు

మహాసభ జరిగే ఎయు కన్వెన్షన్ సెంటర్ వద్ద రెడ్‌షర్ట్ వాలంటీర్లు

రెడ్ షర్ట్ వాలంటీర్లను ఉద్దేశించి మాట్లాడుతున్న వి.శ్రీనివాసరావు

మాట్లాడుతున్న సిఐటియు రాష్ట్ర నాయకులు మురళి

సాగర తీరంలో రెడ్‌షర్ట్ వాలంటీర్ల కవాతు

ఇతర రాష్ట్రాల నుంచి విచ్చేసిన వారికి సమాచారం తెలియజేస్తున్న వాలంటీర్లు

ప్రజాశక్తి -భీమునిపట్నం

సిఐటియు అఖిల భారత మహాసభల నేపథ్యంలో మంగళ వారం సాయంత్రం ఎయు ఎగ్జిబిషన్ గ్రౌండ్ లో "శ్రామిక ఉత్సవ్" పేరిట నిర్వహించిన కార్మికుల పండగ నాలుగో రోజు మంగళవారం అదే ఉత్సాహం, చైతన్యం తో సాగింది. నాగభైరవ కోటేశ్వర రావు రాసిన ప్రజానాట్య మండలి కళాకారులు అప్పన్న ఆధ్వర్యంలో కళాకారులు పాడిన "ఇదే ఇదే నా దేశం... ఇదే ఆంధ్ర దేశం, తరతరాల చరిత్ర లో తనిసిన సందేశం' ఔన్నత్యాన్ని చాటి చెప్పారు.

'పల్లె పల్లెలో ఎగురే ద్దాం ఎర్ర జెండా.. గల్లిగల్లి లో ఎగురేద్దాం ఎర్ర జెండా' అంటూ ఆశా కార్యకర్తల కోలాటం ఆలోచింప జేసింది.

రాజేశ్వరి బృందం చిన్నారులు ప్రదర్శించిన క్లాసికల్ డాన్స్ అబ్బురపరిచింది. అంగన్వాడీ ఉద్యమాన్ని ఉదహరిస్తూ జగన్ పాడిన 'పట్టు పట్టక్క.. జెండా పట్టక్క.. సిఐటియు నీకు నాకు అండ దండక్క' పాట సిఐటియు విశిష్టతను

ఒక్కో కళారూపం.. ఎంతో ప్రత్యేకం..

అన్న పాట సభికులను ఉత్సాహ పరిచింది. శాతవాహనుల శౌర్యం, కాకతీయుల సంగ్రామం, త్యాగరాజు గానం తదితర అంశాలను జోడించి పాడిన పాట ఆలోచింప జేసింది. హంపి, అమరావతి, గోదావరి, కష్ణవేణి కూచిపూడి నృత్యం .. సంస్కృతి సౌరభం వెల్లివిరిసిన నేపథ్యాన్ని ఈ పాటలో పొందుపరిచారు.

విశాఖ జివిఎంసి డప్పు కళాకారుల "తీన్ మార్"ఆకట్టుకుంది.

గాయకులు పెద్ది రాజు అధ్వర్యంలో కళాకారులు పాడిన "రగిలి పోయే ఉద్యమాల జ్వాల, ఇది తెల్ల దొరలనే తరిమేసిన నేల " పాటలో ప్రజా ఉద్యమాలపై నిర్బంధాలు కొత్తేమీకాదని, నిలదీసే గొంతును నొక్కేసినా, ప్రశ్నించే వారిని భయపెట్టినా ఉద్యమాలు ఆగవని వివరించే ప్రయత్నం చేశారు. దేవేంద్ర రాసిన 'తెలుగు భాష ఆకాశంలో పున్నమి చంద్రుడు గురజాడ' అంటూ ప్రజానాట్య మండలి కళాకారులు చంటి పాడిన పాట తెలుగు భాష వివరించారు.

చింతల యాదగిరి రాసిన 'పద పద రా భగత్ సింగ్ వారసుడా, యువ భారత నవ శక్తి కి నాయకుడా' అంటూ ఏలూరు జిల్లా కళాకారుల బృందం ప్రదర్శించిన నృత్య ప్రదర్శన స్వాతంత్ర్య పోరాటంలో భగత్ సింగ్ త్యాగాన్ని వివరించారు. భగత్ సింగ్ అసమానమైన త్యాగం, ఆయన ఆలోచన స్వేచ్ఛకు సంకేతం అంటూ కళాకారులు వివరించారు.

ఏటుకూరి ప్రసాద్ రాసిన 'ఇదే ఎర్ర బాటరా.. ఇదే వెలుగు బాటరా' అంటూ కళాకారులు పాడిన పాట ఎర్ర జెండా ప్రాధాన్యత, విశిష్టత ను వివరించారు. ఎర్ర జెండా పుట్టింది త్యాగాల కొలిమిలో.. అంటూ కళాకారులు ఎర్ర జెండా ప్రాధాన్యత ను వివరించారు.

విప్లవ మార్గం అంటే పూల మార్గం కాదురా.. మార్క్స్, లెనిన్ సిద్ధాంతం భావ కవిత కాదురా .. అంటూ కళాకారులు పాడిన పాట ఆలోచింపజేసింది.

రోహిణి, మాదాల రవికి జ్ఞాపికలు అందజేస్తున్న నిర్వాహకులు

శ్రామిక ఉత్సవ్‌కు విచ్చేసిన కళాకారులు, విద్యార్థులు

మహిళల నృత్య ప్రదర్శన

ప్రదర్శనలతో ఆకట్టుకున్న కళాకారులు

మద్యపానం అనర్థాలపై కళారూపం

కళారూపాలను వీక్షిస్తున్న నగర ప్రజానీకం

విప్లవ గీతాలు ఆలపిస్తున్న ప్రజానాట్య మండలి కళాకారులు

చైతన్యం రగిలించిన రైస్‌మిల్లు కార్మికుల పోరాటాలు

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాలో రైసు మిల్లు కార్మికుల పోరాటాలు విస్తృతంగా సాగాయి. మందస, కోటబొమ్మాళి వంటి ప్రాంతాల్లో చేపట్టిన పోరాటాలు మిగిలిన ప్రాంత కార్మికుల్లో చైతన్యం రగిలించాయి. పనికి వెళ్తే గానీ పూట గడవని స్థితిలో ఉన్నా ఆయా ప్రాంతాల కార్మికులు నెల రోజులకు పైగా సమ్మె చేసి తెగువ ప్రదర్శించారు. పనిలో నుంచి తీసేస్తామన్నా వెరవలేదు. స్థానిక రాజకీయ నాయకులు బెదిరించినా వెనక్కి తగ్గలేదు. తాము అనుకున్న కూలిరేట్లను పెంచుకున్నారు. తమ పోరాట స్ఫూర్తితో ఇతర మిల్లుల్లోని కార్మికులు ఆందోళనకు దిగాల్సిన పని లేకుండానే యజమాన్యాలు కూలి రేట్ల పెంపునకు అంగీకరించేలా చేయగలిగారు.

మందస ప్రాంతంలోని సారంగిపురం, రామకృష్ణాపురం పరిసర గ్రామాల్లోని రైస్‌మిల్లుల్లో సుమారు వంద మంది కార్మికులు పనిచేస్తున్నారు. రెండేళ్లకోసారి కూలి రేట్ల ఒప్పందాన్ని సవరించాల్సిన మిల్లు యజమానులు ఒప్పంద కాలపరిమితి దాటినా పెంచేందుకు అంగీకరించలేదు. దీనిపై మిల్లు కార్మికులు పలుమార్లు యజమానుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం కనిపించలేదు. దీంతో సిఐటియు ఆధ్వర్యాన ఆందోళనలకు సమాయత్తమయ్యారు. కార్మికులు మానేసినా ఫర్వాలేదనుకున్న యజమానులు వారి డిమాండ్లను అంగీకరించలేదు. దీంతో వారు ఆందోళనలను ఉధృతం చేశారు. కార్మికులకు న్యాయం చేయాల్సిన స్థానిక వైసిపి నాయకులు యజమానుల పక్షం వహించారు. రాజకీయ జోక్యం చేసుకుని కూలి రేట్లు తగ్గించడానికి సైతం ప్రయత్నించారు. అంతా ఏకమైనా వారు తమ పోరాటాలను ఆపలేదు. 2023 డిసెంబరులో 42 రోజుల పాటు సమ్మె చేశారు. దీంతో అధికార యంత్రాంగం జోక్యం చేసుకుని 34 శాతానికి పెంచడానికి ఒప్పుకున్నారు.

బెదిరింపులకు దిగినా వెరవని కార్మికులు

కోటబొమ్మాళి ప్రాంతంలోని రైస్‌మిల్లు కార్మికులు ఇదే తరహాలో పోరాటం సాగించారు. వీరు కూడా 40 రోజుల పాటు సమ్మెకు దిగారు. ఇక్కడ ఏకంగా అధికారులే బెదిరింపులకు దిగారు. కార్మికులపై అత్యవసర సేవల నిర్వహణ చట్టం (ఎస్మా) ప్రయోగిస్తామంటూ ఆర్‌డిఒ సైతం హెచ్చరించారు. బెదిరింపులకు వెరవని కార్మికులు తమ సమ్మె కొనసాగించారు. పరిస్థితి చేయిదాటిపోతుండడంతో కార్మికశాఖ అధికారులు జోక్యం చేసుకుని చర్చలు జరిపారు. రైస్‌మిల్లుల్లో చేసే పలురకాల పనులపై 26 శాతం పెంచేందుకు అంగీకరించాయి. కార్మికుల పోరాట ఫలితంగా కార్మికులకు రూ.4,200 బోనస్ దక్కింది. వేళాపాళా లేకుండా పనిచేయించుకున్న పరిస్థితి నుంచి నిర్దిష్ట పనివేళల్లోనే పనిచేసేలా ఒప్పందం సాధించుకున్నారు.

డిమాండ్ నోటీసులతోనే దారికొచ్చిన యజమానులు

కోటబొమ్మాళిలో ఆందోళన చేస్తున్న కార్మికులు (ఫైల్)

పాలకొండ, రాజాం ప్రాంతాల్లోని రైస్‌మిల్లుల్లో పనిచేస్తున్న కార్మికులు కూలి రేట్ల పెంపునకు సిఐటియు అండతో అనేక పోరాటాలు సాగించారు. పాలకొండ మండలం కొమరాడ, అన్నవరం తదితర మిల్లుల్లో పనిచేస్తున్న కార్మికులకు పీస్ రేట్ పెంపుపై కార్మికులు ఆయా యజమానులకు డిమాండ్ నోటీసులు ఇచ్చాయి. ఆందోళనలకు అవకాశం ఇవ్వకుండా డిమాండ్ నోటీసులతోనే యజమానులు దారికొచ్చారు. పలురకాల కూలి పనులపై 29 శాతం పెంచేందుకు అంగీకరించారు. రాజాం మండలంలోని రాజాం, బలిజపేట తదితర ప్రాంతాల్లోని 22 మిల్లులోని కార్మికులకు పెంపు రేటు ప్రయోజనాన్ని దక్కించుకున్నారు. జిల్లాలో పలు ప్రాంతాల్లోని రైస్ మిల్లు కార్మికులు మిల్లులను స్తంభింపచేయడంతో లేనిపోని రచ్చ ఎందుకని యజమానులు డిమాండ్ నోటీసులతోనే వారి పీస్ రేట్లను పెంచేందుకు అంగీకరించారు. కోటబొమ్మాళి మండలం నిమ్మాడ ప్రాంతంలోని కార్మికులు ఎటువంటి పోరాటాలు లేకుండానే డిమాండ్ నోటీస్ ఇచ్చిన వెంటనే పెంపునకు యజమానులు అంగీకరించారు. మిల్లులో చేసే పని ఆధారంగా 26 శాతం పెంపు రేటు దక్కించుకున్నారు. పోలాకి మండలం పిన్నింటిపేటలో కార్మికులు 26 శాతం రేటు సాధించుకున్నారు.

పోరాటంతోనే నిలబడిన బిహెచ్‌పివి

ప్రజాశక్తి - విశాఖపట్నం

కేంద్ర ప్రభుత్వం 1991లో తెచ్చిన నూతన ఆర్థిక విధానాలతో విశాఖలో బిహెచ్‌పివి కష్టాల్లో పడింది. వర్క్ ఆర్డర్ రాకపోవడం, ఎల్‌అండ్‌టి వంటి పరిశ్రమలు పోటీకి రావడంతో ఈ పరిశ్రమ సంక్షోభంలోకి నెట్టబడింది. కార్మికులకు జీతాలు చెల్లించలేని పరిస్థితి దాపురించింది. 1966 జూన్ 25న బిహెచ్‌పివి ఏర్పాటుకు అప్పటి కేంద్ర భారీ పరిశ్రమల శాఖ మంత్రి శంకుస్థాపన చేశారు. ఆ తర్వాత 4000 మంది పర్మినెంట్ ఉద్యోగులు, 500 మంది కాంట్రాక్టు కార్మికులు పనిచేసేవారు. నూతన ఆర్థిక విధానాల తర్వాత బిహెచ్‌పివి పరిస్థితి దిగజారుతూ వచ్చింది. పిఎఫ్ లోనులు ఇచ్చేవారు కాదు. కో-ఆపరేటివ్ సొసైటీలు దివాళా తీశాయి. 2001లో సిఐటియు, ఐఎన్‌టియుసి ఫ్రాక్షన్, బిహెచ్‌పివి ఎంఎస్ ఫ్రాక్షన్ కలిసి ఉమ్మడిగా యూనియన్ ఎన్నికల్లో పోటీచేశాయి. గౌరవాధ్యక్షులుగా సిహెచ్.నర్సింగరావు గెలిచారు. ఆ ఎన్నికల్లో గంటా శ్రీనివాసరావు ఓడిపోయారు. ఈ కాలంలోనే ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా కంపెనీలో పెద్ద పోరాటాలు జరిగాయి. కుటుంబాలతో సహా పోరాటంలోకి వచ్చారు. ఆనాడు కేంద్రంలోఉన్న వాజ్‌పేయ్ నేతృత్వంలోని బిజెపి, రాష్ట్రంలో ఉన్న చంద్రబాబు ప్రభుత్వాల నుంచి సహాయం అందలేదు. కేంద్ర ప్రభుత్వం ఎల్ అండ్ టితో బేరసారాలు జరిపింది. బిహెచ్‌పివిని కొనుగోలు చేయడానికి ఎల్ అండ్ టి కంపెనీని అధికారికంగా కేంద్రం పంపించింది. బిహెచ్‌పివిలోకి ఎల్ అండ్ టి కార్మికుల రాకను కార్మికులు వ్యతిరేకించారు. వచ్చిన వారిని వచ్చినట్లుగా కార్మికులు వెంటబడి తరిమికొట్టారు. ఎల్ అండ్ టి అధికారులు పలాయనం చిత్తగించారు. కేంద్రంలో ఉన్న వాజ్‌పేయ్ ప్రభుత్వం ప్లాన్ మార్చుకొని ఎల్ అండ్ టి నుంచి ఒక అధికారిని మేనేజింగ్ డైరెక్టర్‌గా ఎంపిక చేసి బిహెచ్‌పివికి పంపించింది. వచ్చిన ఎమ్‌డి కర్మాగారానికి వర్క్ ఆర్డర్లు తేకుండా, కార్మికులకు పని లేకుండా కుట్రకు పూనుకున్నాడు. ఎమ్‌డి మోసాన్ని సిఐటియు గుర్తించి మే డే రోజున జెండా ఎగురవేసి, మేనేజింగ్ డైరెక్టర్ గోబ్యాక్ నినాదాన్ని ఇచ్చిది. హైవే నుంచి బిహెచ్‌పివి అడ్మిన్ బిల్డింగ్ వరకు ప్రదర్శన చేసింది. పెద్దపెట్టున నినాదాలతో నిరసన చేపట్టింది. ఎమ్‌డిని బాధ్యతల నుంచి తొలగించాలని డిమాండ్ చేసింది. అప్పటి నుంచి ఉద్యమం ఊపందుకుంది. కొన్ని నెలలకు ఎమ్‌డి రాజీనామా చేసి వెళ్లి పోయాడు. ఆ సమయంలో దేశంలో ఎన్నికలు వచ్చాయి. రాష్ట్రంలో టిడిపి ఓడిపోయింది. కాంగ్రెస్ గెలిచింది. వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టారు. కేంద్రంలో వామపక్షాల సహకారంతో యుపిఎ-1 ప్రభుత్వం ఏర్పాటైంది. మన్మోహన్‌సింగ్ ప్రభుత్వం ఏర్పడింది. రాష్ట్రంలో రాజశేఖరరెడ్డి ప్రభుత్వం బిహెచ్‌పివి టౌన్‌షిప్ స్థలం కొంత భాగం అమ్ముకొని

అప్పులు తీర్చుకొని కర్మాగారం నడుపుకోవచ్చు కదా అని సలహా ఇచ్చింది. దీన్ని సిఐటియు వ్యతిరేకించింది. పోరాడింది. సీతారాం ఏచూరి జోక్యంతో మన్మోహన్‌సింగ్ ప్రభుత్వం భెల్‌లో విలీనం చేయడానికి అంగీకరించింది. ప్రత్యేకంగా కమిటీని ఏర్పాటు చేసి 2018 మే 10న బిహెచ్‌పివిని భెల్ యాజమాన్యం టేకోవర్ చేసుకుంది. ఇప్పుడు మహరత్నగా కొనసాగుతోంది. భెల్ 17వ యూనిట్‌గా ఉంది.

బిహెచ్‌పివికి కూతవేటు దూరంలో ఉన్న హిందూస్తాన్ జింక్ పరిశ్రమ 1977 మార్చి నుంచి ఉత్పత్తి ప్రారంభించి బాగా నడిచింది. కేంద్రంలోని వాజ్‌పేయ్ ప్రభుత్వం జింక్ పరిశ్రమను ప్రయివేటు సంస్థ అయిన వేదాంతకు అప్పగిచ్చింది. ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా యూనియన్ ప్రతిఘటించినా దీర్ఘకాలం కొనసాగలేదు. ప్రయివేటీకరణ ఫలితంగా ప్రస్తుతం ఆ పరిశ్రమ మూతపడింది.

బ్యాంకు ఉద్యోగుల నిరసన

ఐదు రోజులే విధులు ఉండాలని డిమాండ్

ప్రజాశక్తి-విజయనగరం కోట

బ్యాంకింగ్ సేవలు ఐదు రోజులే ఉండాలని కోరుతూ విజయనగరంలోని పలు బ్యాంకుల ఉద్యోగులు బ్యాంకు ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యాన స్టేట్ బ్యాంక్ మెయిన్ బ్రాంచ్ వద్ద మంగళవారం నిరసన తెలిపారు. ఎల్ఐసి, ఇతర సంస్థల మాదిరిగా వారానికి ఐదు రోజులే పని దినాలు కల్పించాలన్నారు. ఇప్పటికే రెండు వారాలు ఐదు రోజులుపనిచేస్తున్నామని, మిగతా వారాల్లో కూడా అదే విధంగా నిర్ణయం తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా బ్యాంకు ఎంప్లాయిస్ కో ఆర్డినేషన్ కమిటీ అధ్యక్షులు బివి ప్రసాద్, సెక్రటరీ కంది మురళీ శ్రీనివాస్ , స్టేట్ బ్యాంక్ నాయకులు ఐన రమేష్, రాజశేఖర గుప్తా, నాగభూషణరావు, భానోజిరావు, హరీష్, తదితరులు పాల్గొన్నారు.

నిరసన తెలుపుతున్న బ్యాంకు ఉద్యోగులు

మాట్లాడుతున్న మజ్జి శ్రీనివాసరావు

అన్ని వర్గాల ప్రజలకు మంచి జరగాలి

వైసిపి జిల్లా అధ్యక్షులు మజ్జి శ్రీనివాసరావు

ప్రజాశక్తి -కంటోన్మెంట్

రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలకు కొత్త సంవత్సరంలో మంచి జరగాలని వైసిపి జిల్లా అధ్యక్షులు మజ్జి శ్రీనివాసరావు ఆకాంక్షించారు. మంగళవారం తన క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రానున్న ఏడాదిలో ప్రజలందరూ సుఖ సంతోషాలతో వర్ధిల్లాలని కోరుతూ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. 2025 వ సంవత్సరంలో వైసిపిని ముందుకు నడిపించడంలో సహకరించిన పార్టీ నాయకులకు, అభిమానులకు, కార్యకర్తలకు ధన్యవాదాలు తెలిపారు. రానున్న నూతన సంవత్సరంలో ఇదే ఉత్సాహంతో అందరూ పనిచేసి పార్టీ కార్యక్రమాలను, కూటమి ప్రభుత్వ వైఫల్యాలపై చేస్తున్న పోరాటాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లడంలో సహాయ సహకారాలు అందించాలని కోరారు. సమావేశంలో వైసిపి రాష్ట్ర కార్యదర్శులు కెవి సూర్యనారాయణ రాజు , నెక్కల నాయుడు బాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి నరసింహ మూర్తి, ఇప్పిలి అనంత , జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు జైహింద్ కుమార్ , జిల్లా స్పోక్స్ పర్సన్ కనకల రఘు పాల్గొన్నారు.

ఆర్‌బికు వినతినిస్తున్న సిపిఎం, సిపిఐ నాయకులు రామారావు, పాపారావు

రైతులకు ధాన్యం డబ్బులు వెంటనే వేయాలి

ప్రజాశక్తి - నెల్లిమర్ల

ధాన్యం అమ్మిన రైతులకు ప్రభుత్వం వెంటనే డబ్బులు చెల్లించాలని సిపిఎం, సిపిఐ నాయకులు కిల్లంపల్లి రామారావు, మొయిద పాపారావు డిమాండ్ చేశారు. మంగళవారం వారు ధాన్యం డబ్బులు చెల్లించాలని కోరుతూ తహశీల్దార్ కార్యాలయంలో ఆర్ఐకి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతుల నుండి ధాన్యం సేకరించి పది రోజులు గడుస్తున్న రైతుల ఖాతాలో డబ్బులు జమ కాలేదన్నారు. 48 గంటలకే రైతుల ఖాతాలో జమ చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించినప్పటికీ దిగువ స్థాయిలో మిల్లర్లు పట్టించుకోవడంలేదన్నారు. జరజాపుపేట ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో కొంతమంది రైతులు విక్రయించి పది రోజులు గడుస్తున్నా వారికి ఇంతవరకు డబ్బులు జమ కాలేదన్నారు. అధికారులు తక్షణమే స్పందించి రైతుల ఖాతాలో ధాన్యం డబ్బులు జమచేయడానికి చర్యలు తీసుకోవాలని కోరారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కనకల పద్మనాభం పాల్గొన్నారు.

కౌశల్ రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రతిభ

ప్రజాశక్తి - నెల్లిమర్ల

తిరుపతిలోని సంస్కృత విశ్వవిద్యాలయంలో ఈ నెల 26,27 తేదీల్లో నిర్వహించిన కౌశల్ రాష్ట్ర స్థాయి పోటీలు -2025లో జిల్లా విద్యార్థులు విశేష ప్రతిభ కనబరిచి పలు బహుమతులు సాధించారు. పోస్టర్ ప్రెజెంటేషన్ విభాగంలో రాష్ట్ర స్థాయి ప్రథమ బహుమతిని మలిచర్ల ఉన్నత పాఠశాలకు చెందిన 8వ తరగతి విద్యార్థి ఎ.సాయివైష్ణవి, 3వ బహుమతిని జరజాపుపేట ఉన్నత పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థి డి. తనుశ్రీ, కన్వోలేషన్ బహుమతిని అయ్యన్నపేట ఉన్నత పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థి జి. భార్గవి, రీల్స్ పోటీలో రాష్ట్ర స్థాయి ద్వితీయ బహుమతిని శ్రీరామ్‌నగర్ పాఠశాలకు చెందిన సిహెచ్. సూర్య ప్రకాష్ సొంతం చేసుకున్నారు. విజేతలను జిల్లా విద్యాశాఖాధికారి యు.మాణిక్యంనాయుడు, ఉప విద్యాశాఖ అధికారి కె.వి రమణ, జిల్లా కౌశల్ కోఆర్డినేటర్ ఎస్.బంగారయ్యను, గైడ్ టీచర్లను అభినందించారు.

ప్రతిభచూపిన విద్యార్థులను అభినందిస్తున్న డిఇఒ మాణిక్యం నాయుడు, డిప్యూటీ డిఇఒ

విద్యార్థులను అభినందిస్తున్న మాజీ ఎమ్మెల్సీ రఘువర్మ

ఖోఖోలో పోలీస్ వెల్ఫేర్ స్కూల్‌కు ద్వితీయ స్థానం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలోని ఉడాకాలనీలోగల నేషనల్ స్కూల్ ఆధ్వర్యాన ప్రైవేటు స్కూల్స్ మధ్య జిల్లా స్థాయి ఖోఖో పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో విజయనగరం పోలీస్ వెల్ఫేర్ స్కూల్ ద్వితీయ స్థానం సాధించింది. ఈ పోటీల్లో జిల్లా మొత్తం 12 బాలుర, 12 బాలికల టీములు పాల్గొన్నాయి. పోలీసు వెల్ఫేర్ స్కూల్ బాలురు, బాలికల టీములు ప్రతిభ కనబరిచి ద్వితీయ స్థానం సాధించినాయి. బహుమతులు సాధించిన క్రీడాకారులకు మాజీ ఉపాధ్యాయ ఎంఎల్‌సి పాకలపాటి రఘు వర్మ, జిల్లా ఎస్‌జిఎఫ్ కార్యదర్శి గోపాల్, ఆర్గనైజర్స్ చేతులమీదుగా ట్రోఫీలు అందజేశారు. ఈ సందర్భంగా పోలీస్ వెల్ఫేర్ స్కూల్ వ్యాయామ ఉపాధ్యాయురాలు కనకల రమను ప్రత్యేకంగా అభినందించారు.

అందుబాటులోనే సరుకుల పంపిణీ : డిఎస్ఒ

ప్రజాశక్తి-పాచిపెంట

సబ్ డిపోల ద్వారా ప్రజలకు అందుబాటులో సరుకులు సరఫరా చేసే విధంగా చర్యలు చేపట్టాలని డిఎస్ఒ బి.అశోక్‌కుమార్ తెలిపారు. మంగళవారం పాచిపెంటలోని ఎంఎల్ఎస్ పాయింట్‌ను ఆకస్మిక తనిఖీ చేశారు. ముందుగా రికార్డులు తనిఖీ చేసి, స్టాక్ వివరాలను పరిశీలించారు. అనంతరం కొటికిపెంట సబ్‌డిపోను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 92 సబ్ డిపోలను ప్రభుత్వం ఏర్పాటు చేసిందని, డిపోల అమలుకు చర్యలు చేపట్టామని తెలిపారు. సాలూరు మండలంలో 4, పాచిపెంట మండలంలో 17 సబ్ డిపోల ఏర్పాటు చేశామని వివరించారు. చిన్న వాహనాల ద్వారా సబ్ డిపోలకు సరుకులు రవాణా చేసేలా చూడాలని డీలర్లకు, సేల్స్ మేన్లకు సూచించారు. ఆంధ్రా నుండి ఒడిశాకు పిడిఎస్ బియ్యం అక్రమ రవాణాను నిరోధించేందుకు చెక్‌పోస్టుల వద్ద పోలీసులు తనిఖీలు చేపడుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఎంఎఒ బాల సరస్వతి, సివిల్ సప్లై డిటిలు హేమలత, గంటా చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ఎంఎల్ఎస్ పాయింట్‌ను తనిఖీ చేస్తున్న డిఎస్ఒ అశోక్‌కుమార్

తెలుగు మహాసభను జయప్రదం చేయండి

ప్రజాశక్తి గుమ్మలక్ష్మీపురం

జనవరి 3, 4, 5 తేదీల్లో అమరావతిలో జరిగే మూడో ప్రపంచ తెలుగు మహాసభను జయప్రదం చేయాలని శ్రీశ్రీ కళావేదిక మన్యం జిల్లా అధ్యక్షులు పాలక దేవానంద్ కోరారు. స్థానిక ఎంఆర్‌సి భవనంలో మంగళవారం మహాసభ కరపత్రాలను ఆవిష్కరించారు. తెలుగువారి అనురాగ సంగమం అధ్యక్షులు గజల్ శ్రీనివాస్ అధ్యక్షతన మహాసభ జరుగుతుందని తెలిపారు. ఉమ్మడి జిల్లాలోని కవులు, కళాకారులు, రచయితలు పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి చంద్రశేఖర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కరపత్రాలు విడుదల చేస్తున్న ఎంఇఒ చంద్రశేఖర్, రచయిత దేవానంద్

వైసిపి యువజన విభాగం జిల్లా కార్యదర్శిగా చంటి

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

వైసిపి యువజన విభాగం మన్యం జిల్లా కార్యదర్శిగా నిమ్మక చంటి నియమితులయ్యారు. ఈ సందర్భంగా జియమ్మవలస మండలం చినమేరంగి కోటలో మంగళవారం మాజీ డిప్యూటీ సిఎం పాముల పుష్ప శ్రీవాణిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. మన్యం జిల్లాలో పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని పుష్ప శ్రీవాణి సూచించారు. ఈ కార్యక్రమంలో వైసిపి యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి నిమ్మక గోపాల్, మీనక కృష్ణారావు, నిమ్మక లక్ష్మణ్, తాడంగి రాజు, తదితరులు ఉన్నారు.

కె.సీతారాంపురంలో పొలం పిలుస్తోంది

ప్రజాశక్తి-సీతానగరం

మండలంలోని కె.సీతారాంపురంలో మంగళ వారం పొలం పిలుస్తోంది కార్య క్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ శాఖ అధికారి రెడ్డి అన్నపూర్ణ మాట్లాడుతూ రబీ పంటల సాగుపై రసాయన ఎరువులు, పురుగు మందుల వాడకం తగ్గిస్తే రైతులకు ప్రయోజనమన్నారు. సేంద్రియ ఎరువులతో పలు రకాల లాభాలు ఉన్నాయని రైతులకు అవగాహన కల్పించారు. ముఖ్యంగా పంటలో రసం పీల్చే పురుగు, కాండం తొలిచే పురుగు నివారణకు వేప నూనె ఉపయోగ పడుతుందని చెప్పారు. కార్యక్రమంలో ఎఒ ఎస్.అవినాష్, వ్యవసాయ శాఖ సిబ్బంది రైతులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జెడి అన్నపూర్ణ

మోసార్ట్ ల్యాబ్‌తో జెఎన్‌టియు ఒప్పందం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జెఎన్‌టియు గురజాడ విశ్వవిద్యాలయం విజయనగరంలో మోసార్ట్ లాబ్ బెంగుళూరు సంస్థతో అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. ఈ ఒప్పందం ద్వారా జెఎన్‌టియులో విద్యార్థులకు విఎల్ఎస్ఐ చిప్ డిజైన్, సెమీకండక్టర్ టెక్నాలజీలు, ఆధునిక ఎలక్ట్రానిక్స్, ఇండస్ట్రీకి అవసరమైన నైపుణ్యాలపై అవగాహన కల్పించేందుకు, పరిశ్రమ-విశ్వవిద్యాలయ సహకారంతో శిక్షణ కార్యక్రమాలు, వర్క్‌షాప్‌లు, సర్టిఫికేషన్ కోర్సులు, పరిశోధన కార్యకలాపాలు నిర్వహించేందుకు ఈ ఒప్పందం దోహదపడనుంది. ఈ కార్యక్రమంలో జెఎన్‌టియు జివి ఉప కులపతి ప్రొఫెసర్ వివి. సుబ్బారావు , రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జి. జయసుమ , మోసార్ట్‌లాబ్ సంస్థ వ్యవస్థాపకులు డాక్టర్ కృష్ణకాంత్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు విద్యార్థులు సెమీకండక్టర్, విఎల్ఎస్ఐ రంగాల్లో వస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని, పరిశ్రమకు అనుగుణంగా తమ నైపుణ్యాలను మెరుగు పరుచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో యూనివర్సిటీ డైరెక్టర్లు ప్రొఫెసర్ కె.చంద్రభూషణ రావు, ప్రొఫెసర్ జి. స్వామి నాయుడు, ప్రొఫెసర్ కె.బాబులు, ప్రొఫెసర్ ఎస్.కె. వలి, డాక్టర్ జిజె నాగరాజు, సిఇవి ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఆర్.రాజేశ్వర రావు, వివిధ విభాగాల ప్రొఫెసర్లు, విభాగాధిపతులు, మోసార్ట్ లాబ్ కంపెనీ ప్రతినిధులు పాల్గొని ఈ ఒప్పందానికి తమ మద్దతు తెలిపారు. ఈ ఒప్పందం ద్వారా విద్యార్థులకు ఉద్యోగావకాశాలు, పరిశ్రమ అనుభవం, పరిశోధనలో కొత్త దారులు తెరుచుకునే అవకాశం లభిస్తుందని యాజమాన్యం అభిప్రాయపడింది.

అవగాహన ఒప్పంద పత్రాలు చూపుతున్న జెఎన్‌టియుజివి విసి, మోసార్ట్ ల్యాబ్ వ్యవస్థాపకులు

సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ నల్లనయ్య

ఓటర్లను సరిపోల్చే పని పూర్తి చేయాలి : కమిషనర్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

2002లో నమోదైన ఓటర్లను 2025 సంవత్సరంతో సరిపోల్చే విధానాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని బూత్ లెవెల్ అధికారులకు నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య ఆదేశించారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. స్పెషల్ ఇన్సెంటివ్ రివిజన్ (సర్) విధానం ద్వారా ఓటర్ల వివరాలు సరిపోల్చే ప్రక్రియ యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలన్నారు. పోలింగ్ కేంద్రాల వారీగా ఆయా ఓటర్ల వివరాలు సరిపోల్చాలన్నారు. వాస్తవానికి విజయనగరం నియోజకవర్గం ఈ విధానం అమలు లో వెనుకబడి ఉన్న విషయాన్ని గుర్తు చేశారు. ఓటరు కార్డులపై అస్పష్టంగా ఉన్న ఫోటోలను మార్పు చేసే విధానం పట్ల పరిశీలనను ముమ్మరం చేయాలని ఆదేశించారు.

పన్నులు చెల్లించకుంటే ఆస్తుల జప్తు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగర పరిధిలో ఆస్తి పన్నులు, ఖాళీ స్థలాల పన్నులను, నీటి ఛార్జీలను తక్షణమే చెల్లించాలని లేని పక్షంలో ఆస్తులను జప్తు చేస్తామని కమిషనర్ పల్లి నల్లనయ్య స్పష్టం చేసారు. మంగళవారం రెవెన్యూ సిబ్బంది, అడ్మిన్ కార్యదర్శులు టీములుగా ఏర్పడి సచివాలయాల పరిధిలో బకాయి ఉన్న ఆస్తి పన్నులను, కులాయి ఛార్జీలను వసూలు చేసే ప్రక్రియలో నిమగ్నమయ్యారు. దీర్ఘకాల బకాయిలు ఉన్న ఆస్తులకు రెడ్ నోటీసులు జారీ చేస్తున్నారు. నగర పరిధిలో ఉన్న దుకాణాల అద్దె బకాయిలను కూడా వసూలు చేసే ప్రక్రియను ముమ్మరం చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ సకాలంలో పన్నులు చెల్లించి నగరాభివృద్ధికి సహకరించాలని, మొండిబకాయిలు చెల్లించకపోతే తప్పనిసరిగా సంబంధిత వ్యక్తుల ఆస్తులు జప్తు చేస్తామని తెలిపారు. కుళాయి బకాయిలు తక్షణం చెల్లించకపోతే కనెక్షన్లను తొలగిస్తామని హెచ్చరించారు. ఆర్థిక సంవత్సరం ముగిసే లోపుగా అత్యధిక శాతం పన్నులు వసూలే లక్ష్యంగా కార్యాచరణ రూపొందించామని తెలిపారు.

ప్రభుత్వ వైద్య కళాశాలలో అరుదైన శస్త్రచికిత్స

యువకుడి కడుపులో రాయి తొలగింపు

ప్రజాశక్తి- కంటోన్మెంట్

జిల్లాకు చెందిన కె. కిరణ్ కుమార్ (28) దీర్ఘకాలంగా (క్రానిక్ కాల్సిఫిక్ ప్యాంక్రియాటైటిస్) వ్యాధితో బాధపడుతూ, తీవ్రమైన పొట్ట నొప్పితో ఆసుపత్రిలో చేరారు.వైద్యులు నిర్వహించిన పలు వైద్య పరీక్షల్లో, రోగి ప్యాంక్రియాస్ గ్రంథిలో రాయిలా ఏర్పడిన కణితి ఉన్నట్లు గుర్తించారు. దీంతో వైద్యులు శస్త్రచికిత్స చేయాలని నిర్ణయించారు. శస్త్రచికిత్సలో భాగంగా ప్యాంక్రియాస్‌ను తెరిచి, అందులో ఉన్న సుమారు 6- 6 సెంటీమీటర్ల పరిమాణంలో ఉన్న రాయిని జనరల్ సర్జరీ విభాగ వైద్యులు మత్తు వైద్యుల సమన్వయంతో విజయవంతంగా తొలగించారు. అనంతరం ప్యాంక్రియాస్‌ను చిన్న పేగుతో అనుసంధానం చేసే (ప్యాంక్రియాటికో-జేజునోస్టమీ) అనే అత్యంత క్లిష్టమైన శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించారు. అనంతరం రోగి పూర్తిగా పొట్ట నొప్పి నుంచి ఉపశమనం పొందారని వైద్యులు తెలిపారు. ప్రస్తుతం రోగి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉండి, క్రమంగా కోలుకుంటున్నారని వెల్లడించారు. విజయ నగరం మెడికల్ కాలేజీకి చెందిన వైద్యుల సమిష్టి కృషితో ఈ క్లిష్టమైన శస్త్రచికిత్సను విజయవంతంగా పూర్తి చేసి, రోగిని వ్యాధి నుంచి కాపాడారు.

రైతులకు అవగాహన కల్పిస్తున్న ఎఒ శ్యామ్ సుందర్

జీవ ఎరువుల తయారీపై అవగాహన

ప్రజాశక్తి - బొబ్బిలి

జీవ ఎరువుల తయారీపై రైతులకు మండల వ్యవసాయాధికారి మజ్జి శ్యామసుందర్ అవగాహన కల్పించారు. గొల్లపల్లిలో మంగళవారం పొలంబడి నిర్వహించారు. ఈసందర్భంగా అయన మాట్లాడుతూ జీవ ఎరువులైన పాస్ఫో బ్యాక్టీరియా, అజోస్పైరిల్లం, పొటాష్ సాలిబుల్ బ్యాక్టీరియా వంటి ద్రవ రూపంలో గల జీవ ఎరువులను ఒక ఎకరానికి అవసరమైన ఒక్కొక్కటి అర లీటర్ చొప్పున ఎండిన పశువుల పెంటను ఎకరానికి 50 కేజీలు తీసుకొని ఆ పశువుల పేడలో నత్రజని, భాస్వరం, పొటాష్ కలిగి ఉన్న జీవ ఎరువులను కలిపి వాటిని రెండు లేదా మూడు రోజులు నీడలో ఉంచి ఎకరా పొలంలో చల్లడం వల్ల రసాయన ఎరువులను సగం తగ్గించవచ్చునని రైతులకు అవగాహన కల్పించారు. ఈ విధంగా జీవ ఎరువులు వాడ వలన రసాయన ఎరువులపై ఆధారపడడం తగ్గించుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకురాలు దాసరి పుణ్యవతి, రైతులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

వి- డెంటల్‌లో అత్యాధునిక దంత వైద్య సేవలు

ప్రజాశక్తి-విజయనగరం కోట

ప్రపంచ స్థాయి నాణ్యత కలిగిన దంత వైద్య చికిత్సలను వి-డెంటల్ హాస్పిటల్‌లో మంగళవారం ప్రారంభించారు. రోటరీ క్లబ్ పాస్ట్ సెక్రటరీ అజయ్ కుమార్ మురార్క రిబ్బన్ కట్ చేసి లాంఛనంగా ప్రారంభించారు. శివ జ్యోతి గ్రూపు ప్రతినిధి జి.జ్యోతి పాల్గొని పేషంట్ వెయిటింగ్ హాల్‌ను ప్రారంభించారు. ఆసుపత్రి మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ జాన్ మాడుగల ఈ సందర్భంగా మాట్లాడుతూ అంతర్జాతీయ ప్రమాణాలతో.. అత్యాధునిక దంత వైద్య పరికరాలతో.. ఆధునిక దంత వైద్యాన్ని అందరికీ అందుబాటులోకి తీసుకురావాలని లక్ష్యంతో తమ ఆసుపత్రిలో ఏర్పాట్లు చేశామన్నారు. అర్థ దవాబ్దంగా విజయనగరంలో దంత వైద్యరంగంలో విశ్వసనీయత కలిగిన దంత వైద్యశాల గా వి డెంటల్ ఆసుపత్రి అందరి ఆదరాభిమానాలు పొందింది అన్నారు. అత్యాధునిక దంత వైద్య విధానాలైనా డెంటల్ ఇంప్లాంట్స్, జైగోమేటిక్ ఇంప్లాంట్స్, లేజర్ చికిత్సలు ఇంప్లాంట్స్, ఇంట్రా డెంటల్ స్కానర్, ఇన్విజిబుల్ అలైనర్స్ వంటి మోడరన్ డెంటిస్ట్రీ ఇప్పుడు విజయనగరం లో ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. వివిధ విభాగాలకు చెందిన దంత వైద్య నిపుణులు అందుబాటులో ఉంటారన్నారు.

దంత వైద్యసేవలను ప్రారంభిస్తున్న అజయ్‌కుమార్

ఆసుపత్రి డైరెక్టర్ కెఎంకె రమేష్ మాట్లాడుతూ గత ఐదేళ్లగా వందలాది ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించి వేలాది మందికి దంతాల ఆరోగ్యం పట్ల అవగాహన కల్పించామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆసుపత్రి కార్పొరేట్ మేనేజర్ కె. పృథ్వీరాజ్, దంత వైద్య నిపుణులు డాక్టర్ అనిత మాడుగుల, డాక్టర్ ప్రిన్స్, డాక్టర్ మధుసూదన్ రావు, డాక్టర్ అర్చన, గ్రామీణ వైద్యుల సంఘం జోనల్ ప్రతినిధులు చిరంజీవి, రమణ అల్లాడి త్రినాథరావు, ఎం.తిరుపతిరావు, రోటరీ క్లబ్ ప్రతినిధి కల్యాణ విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.

కేలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే, ఎపిటిఎఫ్ నాయకులు

ఎపిటిఎఫ్ కేలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఎపిటిఎఫ్ (1938) 2026 క్యాలెండర్‌ను విజయనగరం ఎమ్మెల్యే పూసపాటి అదితి విజయలక్ష్మి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి కృషి చేస్తోంద న్నారు. ఉపాధ్యాయులంతా సహకరించా లని కోరారు. కార్యక్రమంలో ఎపిటిఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు డి ఈశ్వరరావు , జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్‌వి పైడిరాజు, జిల్లా అదనపు కార్యదర్శి ఎవి శ్రీనివాసరావు, జిల్లా ఉపాధ్యక్షులు సిహెచ్ వి ఎస్ ఎన్ మూర్తి , జిల్లా కార్యదర్శి పి.దామోదరనాయుడు, జిల్లా అకడమిక్ కన్వీనర్ పి.బాబులాల్, జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్ ఐ.సిహెచ్ సత్యనారాయణ , మహిళా విభాగం కన్వీనర్ చిన్న దేవి తదితరులు పాల్గొన్నారు.

జనసేనలో పలు కుటుంబాలు చేరిక

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జనసేన నాయకురాలు పాలవలస యశస్వి ఆధ్వర్యంలో పలు కుటుంబాలో ఆపార్టీలో చేరాయి. నగరంలోని 1, 19వ డివిజన్‌ల్లో వైసిపికి చెందిన 150 కుటుంబాల వారు 19 వ వార్డు ఇంచార్జ్ రౌతు కుమార్ ఆధ్వర్యంలో జనసేనలో చేరారు. వీరందరికీ యశస్వి కండువా కప్పి పార్టీ లోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా పాలవలస యశస్వి మీడియాతో మాట్లాడుతూ, పవన్ కళ్యాణ్ చేస్తున్న పరిపాలన, జనసేన పార్టీ ఆశయాలు నచ్చి జనసేన పార్టీలోకి వీరందరూ చేరుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో జనసేన నాయకులు నడిపేన శ్రీనివాస్ (జమ్ము శ్రీను), రౌతు సతీష్ కుమార్, మజ్జి శివ శంకర్, గొర్ల గిరీష్ నాయుడు, పతివాడ చంద్రశేఖర్, పుప్పాల అప్పలరాజు, తురాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మద్యం అమ్మకాల వేళలను సవరించాలి

ఎక్సైజ్ అధికారులకు ఐద్వా నాయకుల వినతి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జిల్లాలో మద్యం అమ్మకాల వేళలను సవరించాలని ఐద్వా జిల్లా కార్యదర్శి పి.రమణమ్మ ఎక్సైజ్ శాఖ అధికారులను కోరారు. మంగళవారం ఎక్సైజ్ అధికారులను కలసి వినతి పత్రం అందజేశారు. నూతన సంవత్సరం వేడుకల సందర్భంగా డిసెంబర్ 30 నుండి జనవరి ఒకటో తేదీ తెల్లవారు జాము వరకు మద్యం అమ్మకాలు ఎక్కువగా జరుగుతున్నాయని తెలిపారు. యువత మద్యం అధికంగా సేవించి రోడ్లపై అసభ్యకరంగా ప్రవర్తిస్తూ ప్రజలకు ముఖ్యంగా మహిళలకు తీవ్ర అసౌకర్యం కలిగిస్తున్నారని తెలిపారు. రోడ్లపై ప్రమాదాలకు గురై కొందరు ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. కావున డిసెంబర్ 30 నుండి 31 వరకు మద్యం అమ్మకాలను రాత్రి 7 గంటల వరకే జరిగేలా నిర్ణయం తీసుకోవాలని ఎక్సైజ్ శాఖ అధికారులను కోరారు. మంగళవారం ఎక్సైజ్ సూపరెండెంట్‌కు ఐద్వా ఆధ్వర్యంలో వినతి పత్రం వినతి అందించిన వారిలో ఐద్వా జిల్లా కార్యదర్శి పి.రమణమ్మ, సహాయ కార్యదర్శి వి.లక్ష్మి, నాయకులు డి.అరుణ, ఎం.లక్ష్మి పాల్గొన్నారు

ఎక్సైజ్ అధికారికి వినతినిస్తున్న ఐద్వా నాయకులు

గిరిజనులను నష్టపరిచే పనులను అడ్డుకుంటాం

మక్కువ-సాలూరు రోడ్డు మర్చిపోయేలా చేశారు : మాజీ డిప్యూటీ సిఎం రాజన్నదొర

ప్రజాశక్తి-మక్కువ

గిరిజనులకు నష్టపరిచే విధంగా ప్రభుత్వం చేపట్టే ఏ పనులనైనా అడ్డుకుంటామని మాజీ డిప్యూటీ సిఎం పీడిక రాజన్నదొర అన్నారు. మంగళవారం వైసిపి మండల అధ్యక్షులు ఎం.రంగునాయుడుతో స్థానికంగా ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పలు పార్టీ అంశాలపై చర్చించారు. అనంతరం రాజన్నదొర విలేకరులతో మాట్లాడుతూ దుగ్గేరు ప్రాంతంలో చింతా గ్రీన్ ఎనర్జీ పంప్డ్ స్టోరేజ్ పవర్ ప్రాజెక్టు కోసం గిరిజన గ్రామాలు ఖాళీ చేయించే అవకాశముందని, పోడు వ్యవసాయంపై ఆధారపడే గిరిజనుల జీవనాధారం పూర్తిగా దెబ్బతింటుందని ఆందోళన వ్యక్తం చేశారు. కొటియా గ్రామాల పరిధిలో గనులు తవ్వకానికి కూటమి ప్రభుత్వం ఉపక్రమిస్తోందని చెప్పారు. అరకు నియోజకవర్గ పరిధిలోని పలు గిరిజన వ్యతిరేక పనులు ప్రభుత్వం చేపట్టనున్నట్లు తెలిసిందన్నారు. వీటన్నింటిపై వైసిపి గట్టిగా పోరాడుతుందని, గిరిజనులకు అండగా నిలుస్తుందని స్పష్టంచేశారు. మక్కువ నుంచి బాగువలస మీదుగా సాలూరు వెళ్లే ప్రధాన రహదారికి గత వైసిపి ప్రభుత్వం నిధులు మంజూరు చేసినా నేటికీ రోడ్డు నిర్మించలేకపోయారని ఎద్దేవాచేశారు. శంబర - మామిడిపల్లి రహదారి అప్పట్లో నిర్మాణం చేపట్టకపోతే ప్రస్తుతం మంత్రి సంధ్యారాణి తమ గ్రామానికి ఎలా చేరుకునేవారో తెలుసుకోవాలన్నారు. ఆ రహదారి ప్రస్తుతం మక్కువ మండల ప్రజలకు ప్రధాన రహదారిగా మారిందన్నారు. ఇటీవల పోలమాంబ జాతర సమీక్షలో 20 రోజుల్లో బాగువలస రహదారి గుండా బస్సులు తిప్పేస్తామని హామీ ఇచ్చారని, ఆ హామీ ఏమైందని ఆయన ప్రశ్నించారు. టిడిపి కూటమి ప్రభుత్వంలో బూటకపు హామీలు తప్ప ఆచరణలో ఏమి లేదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు దండి శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మాజీ డిప్యూటీ సిఎం రాజన్నదొర

టీచర్ అవతారమెత్తిన ఎపిఒ

ప్రజాశక్తి-సీతంపేట

నిత్యం కార్యాలయంలో బిజీగా ఉండే ఐటిడిఎ అసిస్టెంట్ ప్రాజెక్టు అధికారి జి.చిన్నబాబు మంగళవారం టీచర్ అవతారమెత్తారు. సీతంపేట మండలంలోని బుడగరాయి గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన టీచర్ అవతారమెత్తి పదో తరగతి విద్యార్థులకు మ్యాథ్స్ పాఠాలు చెప్పారు. విద్యార్థుల ఎఫ్ఎ, ఎస్ఎ పరీక్షల మార్కులను పరిశీలించారు. పాఠశాల పరిసరాలను, మరుగుదొడ్లను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. విద్యార్థులకు రుచికరమైన భోజనం పెట్టాలని చెప్పారు. స్టాక్ రూమ్‌ను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం, డిప్యూటీ వార్డెన్ ఊయక గణపతిరావు, ఉపాధ్యాయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

పాఠాలు చెబుతున్న ఎపిఒ చిన్నబాబు

సృజనాత్మకతను పెంపొందించాలి

ప్రజాశక్తి-కొమరాడ

పిల్లల్లో సృజనాత్మకతను, పోటీతత్వాన్ని పెంపొందించాలని జిల్లా విద్యాశాఖ అధికారి పి.బ్రహ్మాజీరావు అన్నారు. మంగళవారం మండలంలో అర్తం గ్రామంలో విక్రంపురం క్లస్టర్ మేళా విద్యా సదస్సును ప్రధానోపాధ్యాయులు కంచుమోజు రామ్మోహన్ రావు ఆధ్వర్యంలో నిర్వహించారు. సదస్సులో డిఇఒ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు అన్ని రంగాల్లో ఆసక్తి పెంచేలా ప్రతి ఉపాధ్యాయుడు కృషి చేయాలన్నారు. కార్పొరేట్ స్థాయికి అనుగుణంగా ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. గతం కంటే ఇప్పుడు ప్రభుత్వ పాఠశాలపై విద్యార్థుల తల్లిదండ్రులకు ఎంతో భరోసా కలుగుతుందని అన్నారు. ప్రభుత్వ విద్యపై ప్రజలకు పూర్తిస్థాయిలో నమ్మకం రోజురోజుకీ పెరుగుతోందని, అందుకు కారణం ఉపాధ్యాయులేనని చెప్పారు. కార్యక్రమంలో డిప్యూటీ డిఇఒ రాజ్‌కుమార్, హిందీ పండిట్ మంచుపల్లి శ్రీరాములు, సమగ్ర శిక్ష ఎపిసి ఆర్.తేజేశ్వరరావు, ఎఎంఒ కోటేశ్వరరావు, ఎంఇఒలు జామి నారాయణస్వామి, గులిపల్లి చినతిరుపతి రావు, మజ్జి గౌరీ శంకర్ రావు, ఎంపిటిసి సభ్యులు దేవకోటి వెంకటనాయుడు, సర్పంచ్ గాజుల శ్రీనివాస్‌రావు, ఉప సర్పంచ్ కాలిశెట్టి శంకర్‌రావు, బెలగాం భీమేశ్వరరావు, జ్యోతి పాల్గొన్నారు.

విద్యా సదస్సులో డిఇఒ బ్రహ్మాజీరావు

జ్ఞాపికను అందిస్తున్న డిఇఒ

గిరిజన పంచాయతీ ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి-పార్వతీపురం

మండలంలోని పెదమరికి పంచాయతీలో ఉన్న కొత్త ఊరు, చందలింగి, శివన్నదొరవలస గ్రామాలతో నూతన గిరిజన పంచాయతీ ఏర్పాటు చేయాలని పెదమరికి పంచాయతీ సర్పంచ్ హిమరక గంగ కోరారు. ఈ మేరకు మంగళవారం కొత్త ఊరు, చందలింగి గ్రామ గిరిజనులతో కలిసి కలెక్టర్ కార్యాలయంలో జాయింట్ కలెక్టర్ యశ్వంత్ కుమార్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. మూడు గ్రామాల్లో పూర్తిగా 900 మంది గిరిజనులే ఉన్నారని వివరించారు. జెసి స్పందిస్తూ జిల్లా పంచాయతీ అధికారితో మాట్లాడుతానని తెలియజేశారు. కార్యక్రమంలో గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి పాలక రంజిత్ కుమార్, గిరిజన యువకులు బొండపల్లి జనార్దన, హిమరక రాజు, పూయక రామారావు, పూయక వాసు తదితరులు పాల్గొన్నారు.

ఇవిఎం గోడౌన్‌లో తనిఖీలు

ప్రజాశక్తి-పార్వతీపురం

పార్వతీపురంలోని ఇవిఎం, వివి ప్యాట్ల గోడౌన్‌ను కలెక్టర్ ఎన్.ప్రభాకర రెడ్డి మంగళవారం తనిఖీ చేశారు. రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఈ సాధారణ తనిఖీలు నిర్వహించారు. గోడౌన్ వద్ద ఏర్పాటు చేసిన సిసి టివి నిఘా, పోలీస్ భద్రతను సమీక్షించారు. భద్రతా రిజిస్టర్లను తనిఖీ చేసి, నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సిబ్బందిని ఆదేశించారు. గాలి, వెలుతురు సరిగ్గా ఉండేలా చూడటం, అగ్నిమాపక పరికరాల పనితీరును పరిశీలించారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి కె.హేమలత, టిడిపి ప్రతినిధి గొట్టాపు వెంకటనాయుడు, జనసేన ప్రతినిధి పైలా శ్రీనివాసరావు, కాంగ్రెస్ ప్రతినిధి వంగల దాలినాయుడు, వైసిపి ప్రతినిధి వి.శ్రీనివాసరావు, ఎన్నికల విభాగం సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఇవిఎం గోదాములను పరిశీలిస్తున్న కలెక్టర్

విద్యార్థుల సమస్యలపై నిరంతర పోరాటం

గుమ్మలక్ష్మీపురం: విద్యార్థుల సమస్యలపై ఎస్ఎఫ్ఐ నిరంతర పోరాటం సాగిస్తోందని మండల కార్యదర్శి ఎ. గంగారావు అన్నారు. మండల కేంద్రంలోని పోస్ట్ మెట్రిక్ బాలుర వసతిగృహంలో మంగళవారం ఎస్ఎఫ్ఐ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో సహాయ కార్యదర్శి బి. శ్రీకాంత్ ఉన్నారు.

పండిట్ పోస్టుల అప్‌గ్రేడ్‌పై హర్షం

ప్రజాశక్తి-పార్వతీపురం

గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో పండిట్, పిఇటి పోస్టుల అప్‌గ్రేడేషన్‌పై యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.మురళీ మోహనరావు, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కె.కృష్ణారావు, కె.భాస్కరరావు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు మంగళవారం వారు ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల మంత్రివర్గ సమావేశంలో తెలుగు, హిందీ, పిఇటి పోస్టుల అప్‌గ్రేడేషన్‌కి ఆమోదం తెలుపుతూ జిఒ 27 జారీ చేయడం హర్షణీయమని పేర్కొన్నారు. రాష్ట్రంలో తెలుగు పండిట్ 227, హిందీ పండిట్ 91, పిఇటి 99 పోస్టుల అప్‌గ్రేడేషన్‌కి ఆమోదం తెలిపినట్లు చెప్పారు. 15 రోజుల క్రితం దీనికి సంబంధించిన జిఒ విడుదల చేసినట్లు తెలిపారు.

ఎట్టకేలకు వచ్చిన కంపాక్టర్ వాహనం

ప్రజాశక్తి-పార్వతీపురం టౌన్

కంపాక్టర్ వాహనం ఎట్టకేలకు పార్వతీపురం పట్టణానికి మంగళవారం చేరింది. నవంబర్ 16న 'ప్రజాశక్తి'లో ప్రచురితమైన 'మూలకు చేరిన చెత్త వాహనాలు' కథనానికి మున్సిపల్ కమిషనర్ కిశోర్ కుమార్ స్పందించి ఇంజినీరింగ్ అధికారులతో మాట్లాడారు. మూలకు చేరిన రెండు కంపాక్టర్లలో ఒక వాహనానికి మరమ్మతులు చేయించారు. చిలకపాలెం నుంచి మంగళవారం పట్టణానికి రప్పించారు. కమిషనర్ కిశోర్‌కుమార్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ పకీర్‌రాజు ఆ వాహనాన్ని పరిశీలించారు. ఇంకొక కంపాక్టర్ వాహనం చేరడానికి ఇంకెన్ని నెలలు పడుతుందోనని పలువురు బహిరంగంగానే వ్యాఖ్యానిస్తున్నారు.

ప్రజాశక్తి కథనానికి స్పందన

వాహనాన్ని పరిశీలిస్తున్న అధికారులు

నిబంధనలు పాటించకుంటే చర్యలు

ప్రజాశక్తి -కురుపాం

నిబంధనలకు విరుద్ధంగా వాహనాలు నడిపితే చర్యలు తీసుకుంటామని నీలకంఠాపురం ఎస్ఐ నీలకంఠరావు హెచ్చరించారు. మంగళవారం నీలకంఠాపురంలోని వాహన తనిఖీలు చేపట్టారు. అనంతరం వాహనచోదకులకు పెండింగ్ అపరాధ రుసుం, రహదారి భద్రతపై అవగాహన కల్పించారు. పరిమితికి మించి ఎక్కించినా, వాహన పత్రాలు లేకపోయినా చర్యలు తీసుకుంటామన్నారు. ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తే ప్రమాదాలు తగ్గి ప్రాణనష్టం నివారించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

కేదారిపురంలో ముస్తాబు

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

కేదారిపురంలో ముస్తాబు కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పంచాయతీ ప్రత్యేక అధికారి బి.చంద్రశేఖర రావు, పంచాయతీ అభివృద్ధి అధికారి బి.సురేష్ మాట్లాడుతూ పచ్చని, పరిశుభ్రమైన గ్రామంగా తయారు చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. అందుకు గ్రామ ముస్తాబు కమిటీలను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు.

మెటీరియల్‌తో ఉపాధ్యాయులు విద్యార్థులు

పరీక్షల మెటీరియల్ పంపిణీ

ప్రజాశక్తి-సీతానగరం

మండలంలో బూర్జ, మరిపివలస, నిడగల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లోని పదో తరగతి విద్యార్థులకు మంగళవారం పరీక్షా మెటీరియల్‌ను యుటిఎఫ్ ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. కార్యక్రమంలో యుటిఎఫ్ మండల అధ్యక్ష, కార్యదర్శులు బొత్స ప్రసాదరావు, మర్రాపు గోవిందరావు, నాయకులు పల్లి శ్రీనివాసరావు, రాయిడి శంకరరావు పాల్గొన్నారు.

నడుకూరులో వైద్య శిబిరం

ప్రజాశక్తి-వీరఘట్టం

మండలంలోని నడుకూరు గ్రామంలో మంగళవారం స్థానిక వైద్యాధికారి బి.ప్రదీప్ కుమార్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. రోగులకు వైద్య పరీక్షలు చేసి, మందులు అందజేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కేలెండర్‌ను ఆవిష్కరిస్తున్న యుటిఎఫ్ నాయకులు

యుటిఎఫ్ కేలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-వీరఘట్టం

స్థానిక ఎంఆర్‌సిలో మంగళవారం ఎంఇఒ ఆర్.ఆనందరావు యుటిఎఫ్ నూతన సంవత్సర కేలెండర్, డెయిరీని ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు ఎం.పైడిరాజు, బి.దుర్గాప్రసాద్, కె.గోవిందరావు, ఎ.స్వామిబాబు, కె.గౌరునాయుడు, ఎ.చంద్రమోహన్, ఎం.ముకుందరావు, వి.శ్రీధర్, బి.వాసుదేవరావు, ఎం.అప్పలనాయుడు, డి.చంద్రమౌళి, ఎస్.గణేష్, ఎల్.గణేష్, సిహెచ్ భవాని కుమారి, పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

ప్రజాశక్తి - కురుపాం

కురుపాం పోలీస్‌స్టేషన్లో మంగళవారం డిఎస్‌పి ఎం.రాంబాబు ఆధ్వర్యంలో 'సమాజంపై గంజాయి, మాదకద్రవ్యాల ప్రభావం-విద్యార్థుల పాత్ర' అనే అంశంపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎల్విన్‌పేట సిఐ బి.హరి, ఎస్ఐ పి.నారాయణరావు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

హెల్ప్‌లైన్ నెంబరు 1098 ఆకారంలో కూర్చున్న విద్యార్థులు

బాల్య వివాహాలను అరికట్టాలి

ప్రజాశక్తి-విజయనగరం కోట

బాల్య వివాహాలను అరికట్టాలని నారాయణ పబ్లిక్ స్కూల్ కరస్పాండెంట్ ఎం. నారాయణ రావు అన్నారు. మంగళవారం బాల్య వివాహాలపై విద్యార్థులకు పాఠశాలలో అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ముందుగా బాల్య వివాహాలు అరికట్టడానికి హెల్ప్ లైన్ నెంబర్ 1098 ఆకారంలో విద్యార్థులు కూర్చొన్నారు. అనంతరం ప్లకార్డులు పట్టుకొని బాల్యవివాహాలు వద్దు-చదువు ముద్దు అని నినదించారు ఈ సందర్భంగా నారాయణరావు మాట్లాడుతూ బాల్య వివాహాల వల్ల ఆరోగ్య సమస్యలతో పాటు వారి జీవితం నాశనం అవుతుందన్నారు చదువుకు ఆటంకం కలుగుతుందన్నారు. కావున బాల్య వివాహాలను వ్యతిరేకించాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రచార రథం ఫొటో చూపుతున్న ఎమ్మెల్యే బేబినాయన

రథోత్సవం పునరుద్ధరణ : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - బొబ్బిలి

శ్రీవేణుగోపాల స్వామి రథోత్సవం పునరుద్దరణకు చర్యలు తీసుకుంటున్నట్లు ఆలయ ధర్మకర్త, ఎమ్మెల్యే బేబినాయన చెప్పారు. స్థానిక ఆలయంలో మంగళవారం మాట్లాడుతూ 1930 వరకు దీపావళి అమావాస్య రోజున పట్టణంలో రథోత్సవం జరిగేదని, 1930లో బొబ్బిలిలో రథోత్సవం జరిగిన రోజున స్వాతంత్ర్య పోరాటం సభ నెహ్రూ నిర్వహించడంతో ఆరోజున రథోత్సవం రద్దు అయిందని చెప్పారు. రథోత్సవం నిర్వహణకు చినజీయర్ స్వామితో చర్చించగా పునరుద్దరణ చేయాలని చెప్పడంతో నూతన రథం తయారు చేసేందుకు ఆర్డర్ ఇచ్చినట్లు చెప్పారు. రథం తయారుకు రూ.40లక్షల వరకు ఖర్చు అవుతుందని, తాము మొత్తం పెట్టేందుకు పెద్ద విషయం కానప్పటికీ ప్రజల భాగస్వామ్యం కల్పించేందుకు నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. రథం తయారీలో ప్రజలు భాగస్వామ్యం కావాలని, ఎవరు ఎంత ఇచ్చినా స్వీకరిస్తామని చెప్పారు.

లైఫ్ సర్టిఫికెట్ సమర్పణకు ఏర్పాట్లు

ప్రజాశక్తి-విజయనగరం

పెన్షనుదారులు తమ లైఫ్ సర్టిఫికెట్టు సమర్పణకు జిల్లా ట్రజరీ, సబ ట్రజరీలలో పెన్షను దారుల సౌకర్యార్థం తగు ఏర్పాట్లు చేశామని, ఈ సేవలను ఉపయోగించుకోవాలని జిల్లా ఖజానా అధికారి వి.నాగమహేష్ మంగళవారం తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ పెన్షనుదారులు, కుటుంబ పింఛనుదారులు తమ లైఫ్ సర్టిఫికేట్‌ను 2026 సంవత్సరానికి తప్పనిసరిగా జనవరి 1 నుండి ఫిబ్రవరి 28 లోపు మాత్రమే సమర్పించాల్సి ఉందన్నారు. నవంబర్ 2025 మరియు డిసెంబర్ 2025 లో సమర్పించిన లైఫ్ సర్టిఫికేట్లు 2026 సంవత్సరానికి చెల్లవని, ఈ విషయంను పెన్షనుదారులందరు గమనించాలని ఆయన కోరారు. కాబట్టి 2025 లో ముందే లైఫ్ సర్టిఫికేట్ ఇచ్చినవారు కూడా తప్పనిసరిగా 1.1.2026 నుంచి 28.2.2026 మధ్యలో మళ్లీ సమర్పించాలని ఆయన కోరారు. పెన్షన్ విడుదలలో ఇబ్బందులు తలెత్తకుండా సూచించిన తేదీల్లో లైఫ్ సర్టిఫికేట్లు తప్పనిసరిగా సమర్పించాలని పెన్షనుదారులకు ఆయన విజ్ఞప్తి చేసారు. లైఫ్ సర్టిఫికేట్ సమర్పణకు అవసరమగు పత్రాలు, పిపిఒ నంబర్, ఆధార్ నంబర్, బ్యాంక్ ఖాతా సంఖ్య, మొబైల్ నంబర్ లైఫ్ సర్టిఫికేట్ సమర్పణ కోసం ఖజనా కార్యాలయాలకు వెళ్లే పెన్షనుదారులు తప్పనిసరిగా తీసుకురావాలని సూచించారు.

ఆర్థిక అవసరాలు తీర్చేందుకే కో-ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ

ఎస్‌పి ఎఆర్ దామోదర్

ప్రజాశక్తి -కంటోన్మెంట్

పోలీసు సిబ్బంది ఆర్థిక అవసరాలు తీర్చేందుకే కో-ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ ఏర్పాటైందని ఎస్‌పి ఎఆర్ దామోదర్ తెలిపారు. జిల్లా పోలీసు ఉద్యోగుల కో-ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ సర్వ సభ్యుల సమావేశం జిల్లా పోలీసు కార్యాలయంలో మంగళవారం ఎస్‌పి ఎ.ఆర్.దామోదర్ ఆధ్వర్యాన జరిగింది. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ తక్కువ వడ్డీతో కో-ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ ద్వారా రుణాలను పొందే పోలీసు ఉద్యోగులు తమ పిల్లల చదువులు, వివాహాలు, గృహ నిర్మాణాలు, రిపేర్లు, అత్యవసర వైద్య ఖర్చులు, ఇతర ఆర్థిక అవసరాలను తీర్చుకోగలుగుతున్నారని తెలిపారు. ఈ సొసైటీ ద్వారా 2024-25 సంవత్సరానికి వచ్చిన ఆదాయ, వ్యయాలను, పోలీసు సంక్షేమానికి తీసుకున్న చర్యలను సొసైటీ సభ్యులకు వివరించారు. ఈ సొసైటీ ద్వారా 2024-25 ఆర్థిక సంవత్సరానికి షేర్ కేపిటల్ పై 6 శాతం డివిడెంట్, త్రిఫ్ట్ డిపాజిట్స్‌పై 3 శాతం వడ్డీని త్వరలో సభ్యుల బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తామన్నారు. పోలీసు ఉద్యోగులు తీసుకున్న సభ్యత్వం, సర్వీసు ఆధారంగా ఇప్పటికే రూ. 3లక్షల నుండి 5 లక్షలను వ్యక్తిగత రుణాలుగా, ఆడపిల్ల పెళ్లి నిమిత్తం 8 లక్షలు అందజేస్తున్నామని తెలిపారు. సొసైటీ సభ్యుల పిల్లలకు టెన్త్, ఇంటర్‌లో 90శాతం కంటే ఎక్కువ మార్కులు వచ్చిన పిల్లలకు మెరిట్ స్కాలర్‌షిప్‌లను కూడా అందజేస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలో మన జిల్లాలో నడుస్తున్న కో-ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ మిగతా జిల్లాలకి ఆదర్శంగా ఉందన్నారు. త్వరలో జిల్లా కో-ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీకి కొత్త భవనం నిర్మాణానికి చర్యలు చేపడతామన్నారు. సమావేశంలో ఎఎస్‌పి పి.సౌమ్యలత, ఎఆర్ డిఎస్‌పి ఇ.కోటిరెడ్డి, ఎస్‌బి సిఐలు ఎ.వి.లీలారావు, ఎస్.విద్యాసాగర్, ఆర్ఐలు ఎన్. గోపాల నాయుడు, రమేష్, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది, కో-ఆపరేటివ్ సెక్రటరీ ఎం. నీలకంఠం నాయుడు, డైరెక్టర్లు, కో-ఆపరేటివ్ సభ్యులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎస్‌పి ఎఆర్ దామోదర్

అంతర్ కళాశాలల అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ పోటీలు

ప్రజాశకి-విజయనగరం టౌన్

జెఎన్‌టియుజివి ఆధ్వర్యంలో అంతర్-కళాశాల అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ (పురుషులు,మహిళలు) రెండురోజులు పాటు విజయవంతంగా జరిగాయి. ఈ పోటీల్లో యూనివర్సిటీకి అనుబంధంగా ఉన్న 18 ఇంజినీరింగ్, ఫార్మసీ కళాశాలల నుంచి 200 మందికి పైగా విద్యార్థి అథ్లెట్లు ఉత్సాహంగా పాల్గొన్నారు. క్రీడల ద్వారా విద్యార్థుల్లో క్రీడాస్ఫూర్తి, శారీరక దృఢత్వం పెంపొందించడం, యూనివర్సిటీ స్థాయి పోటీలకు ప్రతిభావంతులైన క్రీడాకారులను ఎంపిక చేయడం ఈ ఛాంపియన్‌షిప్ ప్రధాన ఉద్దేశమని జెఎన్‌టియుజివి విసి వివి సుబ్బారావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల సమగ్ర అభివద్ధిలో క్రీడల పాత్ర అత్యంత కీలకమని, విద్యతో పాటు క్రీడల్లోనూ ప్రతిభను కనబర్చాలని విద్యార్థులను ప్రోత్సహించారు. రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జయసుమ నిర్వాహక బృందాన్ని అభినందించారు. ఈ పోటీల్లో ప్రతిభ కనబర్చిన క్రీడాకారులకు పతకాలు ప్రదానం చేశారు. కార్యక్రమంలో జెఎన్‌టియుజివి స్పోర్ట్స్ కోఆర్డినేటర్ జి.అప్పలనాయుడు, ఆర్గనైజింగ్ కార్యదర్శి డాక్టర్ కె.నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

గెలుపొందిన క్రీడాకారులు

ప్రభుత్వ భూమిలో ప్రయివేటు పాఠశాల

ప్రజాశక్తి - పూసపాటిరేగ

మండలంలోని కోనాడ జంక్షన్ సమీపంలో కొప్పెర్ల పంచాయతీ పరిధిలో ప్రభుత్వ భూమిలో ఓ ప్రయివేటు పాఠశాల భవనాలు నిర్మాణం చేసి విద్యాశాఖ అనుమతులు పొందడం చర్చనీయాంశమైంది. ఈ విషయమై గ్రామస్తులు తహశీల్దార్ ఎన్‌వి రమణకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు రెవెన్యూ అదికార్లు సర్వే చేసి పాఠశాల ఉన్న స్థలం ప్రభుత్వం, ఆర్అండ్‌బిదిగా తేల్చారు. సాయికోర్ స్కూల్ ఆఫ్ నాలెడ్జ్ పేరుతో నడుస్తున్న పాఠశాల ప్రభుత్వం భూమిలో ఉన్నట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. ఈ భూమి ప్రభుత్వానిదని, ఆక్రమణదారులు శిక్షార్హులని మంగళవారం రెవెన్యూ సిబ్బంది బోర్డు పెట్టారు. సర్వే నెంబర్ 55, 56లో ఉన్న భవనాలు తొలగించాలని యాజమాన్యానికి సూచించారు. ప్రభుత్వ భూమిలో ప్రయివేటు పాఠశాలకు విద్యాశాఖ ఎలా అనుమతులు ఇచ్చారన్న చర్చ జరుగుతోంది.

గాంధీ పేరు తొలగించడం అన్యాయం

ప్రజాశక్తి-విజయనగరం కోట

దేశానికి స్వాతంత్రం సాధించిన జాతిపిత మహాత్మా గాంధీ పేరును చరిత్ర పుటల్లోంచి తొలగించేందుకు కుట్ర జరుగుతుందని, మహాత్మా గాంధీ ఉపాధి హామీ చట్టం పేరును జి రాంజీ పేరుగా మార్చడం ఈ కుట్రలో భాగమని జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రొంగలి పోతన్న ఆవేదన వ్యక్తం చేశారు. నగరంలోని బాలాజీ జంక్షన్‌లోగల ప్రజా గ్రంథాలయంలో మంగళవారం ప్రజా విజయం పార్టీ ఆధ్వర్యంలో నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న పోతన్న మాట్లాడుతూ దేశంలో సమైక్యతాభావం రోజురోజుకూ దెబ్బతింటోందన్నారు. కులాలు, మతాలుగా దేశం విడిపోతే దేశ ప్రజాస్వామ్య వ్యవస్థకు తీవ్ర విఘాతం ఏర్పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజా విజయం పార్టీ వ్యవస్థాపకుడు పి.షణ్ముఖరావు మాట్లాడుతూ అంబేద్కర్ రాజ్యాంగానికి తూట్లు పొడిచే పరిస్థితి దేశంలో నెలకొందని, ప్రజలకు ఉచిత విద్య,వైద్యం అందించాలని రాజ్యాంగం ప్రాథమిక హక్కుల్లో అంబేద్కర్ పొందుపరిస్తే వాటిని ప్రాథమిక హక్కుల నుంచి తొలగించి ఆదేశిక సూత్రాల్లో పెట్టారని అన్నారు. దేశ ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందన్నారు. కార్యక్రమంలో ప్రజా విజయం పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి సిహెచ్ బంగారు రాజు, గాంధీ స్మారకనిధి ప్రధాన కార్యదర్శి మజ్జి కాంతారావు, విశ్వం ఫౌండేషన్ అధ్యక్షుడు, విశ్రాంత డిఎస్‌పి యూనివర్స్, నవ్యాంధ్ర గ్రంథాలయం సంస్థ ప్రధాన కార్యదర్శి ఈపు విజయ్ కుమార్, ఎం.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంత వాతావరణంలో న్యూఇయర్ వేడుకలు నిర్వహించుకోవాలి : ఎస్‌పి

ప్రజాశక్తి-పార్వతీపురం టౌన్

నూతన సంవత్సర వేడుకలను జిల్లాలో ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని ఎస్‌పి ఎస్.వి.మాధవ్ రెడ్డి కోరారు. వేడుకల పేరుతో ఎవరైనా నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. నూతన సంవత్సర వేడుకలను ప్రశాంతయుతంగా నిర్వహించుకొనేందుకు ప్రజలకు కొన్ని సూచనలు చేశారు. బుధవారం రాత్రి బహిరంగ ప్రదేశాల్లో, రహదారులపై నూతన సంవత్సర వేడుకలను నిర్వహించరాదని చెప్పారు. మద్యం సేవించి వాహనాలు నడపరాదని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి, మద్యం సేవించి వాహనాలు నడిపిన వారిపై డ్రంకన్ డ్రైవ్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. వాహనాలను అతివేగంగా నడిపినా, బైక్ రేసులు నిర్వహించినా, ట్రిపుల్ రైడింగు చేసినా కేసులు నమోదు చేసి, వాహనాలను సీజ్ చేస్తామని స్పష్టంచేశారు. అర్ధరాత్రి ఒంటి గంట తరువాత ప్రజలెవరూ రహదారులపై తిరగరాదని తెలిపారు. మైనర్లకు వాహనాలను ఇవ్వరాదని చెప్పారు. ఎవరైనా మైనరు డ్రైవింగు చేసి పట్టుబడితే, వారిపైనా, వారికి వాహనాలిచ్చిన తల్లిదండ్రులు లేదా ఆయా వాహన యజమానులపైనా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఎటువంటి అల్లర్లు, అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా జిల్లా వ్యాప్తంగా ముఖ్య కూడళ్లలో పోలీసు బందోబస్తు, పికెట్లు ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు.

బహిరంగ ప్రదేశాల్లో కేకులు కట్ చేయడం, నృత్యాలు చేయడం, బహిరంగ పార్టీలు నిర్వహించడం, డిజె/లౌడు స్పీకర్లతో పెద్ద శబ్దం చేస్తూ ప్రజలకు ఇబ్బంది కలిగిస్తే చర్యలు తీసుకుంటామని తెలిపారు. వేడుకల పేరుతో మందుగుండు సామగ్రిని కాల్చడం, ప్రదర్శించడం లేదా ఉపయోగించినా చర్యలు తప్పవని స్పష్టంచేశారు. ప్రభుత్వం నిర్దేశించిన సమయం వరకు మాత్రమే మద్యం విక్రయాలు చేపట్టాలని, నిబంధనలు ఉల్లంఘిస్తే ఆయా మద్యం షాపులు, బార్లపైనా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.